ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మీ వెంటే!

రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 42.0 (శుక్రవారం)
కనిష్ఠం : 26.0

హిందూ ముస్లిం భాయీ..భాయీ.. కష్టమైనా నష్టమైనా ఇప్పటి వరకూ అంతే.. ప్రస్తుతం కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ముస్లింలు ముక్తకంఠంతో ఖండిస్తున్నారు.. అది ముమ్మాటికి తప్పేనని నినదిస్తున్నారు.. నిడదవోలు, చాగల్లులో శుక్రవారం ముస్లింలు ఇలా రోడ్డెక్కి పహల్గాం మృతులకు నివాళులర్పించారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



మా బాబే బాగున్నావా : పవన్‌ను ఆప్యాయంగా పలకరిస్తున్న మహిళ

మీ కోసం నేనున్నాను : అభిమానులకు పవన్ అభివాదం

మీ ప్రేమకు.. అభివందనం!

10 నెలలు.. పిఠాపురంలో రూ.100 కోట్ల అభివృద్ధి

(కాకినాడ/పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుంటున్నాం. నూరు శాతం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. పిఠాపురం, యు.కొత్తపల్లి మండలాల్లో శుక్రవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు.



టీటీడీ కల్యాణ మండపానికి శంకుస్థాపన

అభివృద్ధి ఇలా..

పిఠాపురం నియోజకవర్గంలోని పలుగ్రామాల్లో రూ.18.02 కోట్లతో 31.59 కి.మీల మేర 276 సిమెంట్ రోడ్లు నిర్మాణం పూర్తిచేసి ప్రారంభించామని పవన్‌కల్యాణ్ అన్నారు. 5.21 కి.మీల పొడవునా ఏడు తారురోడ్లను రూ.3.20 కోట్లతో పూర్తి చేశామని, వీటి ద్వారా 300 మంది కాంట్రాక్టర్లకు, 5 వేల మంది శ్రామికులకు పనికల్పించామన్నారు. 434 గోదాంలతోపాటు వివిధ పనుల నిమిత్తం రూ.8.68 కోట్లు వ్యయం చేశామన్నారు. మరో రూ.21.58 కోట్లతో చేపట్టిన పనులు మరో మూడు నెలల్లో పూర్తవనున్నాయన్నారు. కొత్తపల్లిలో రూ.2 కోట్లతో టీటీడీ కల్యాణ మండపాన్ని నిర్మిస్తున్నామన్నారు. 225 ఏళ్ల చరిత్ర కలిగిన గొల్లప్రోలు సీతారామస్వామి దేవస్థానంలో రూ.1.32 కోట్లతో ప్రాకార మండపం నిర్మిస్తున్నామన్నారు. చేబ్రోలు సీతారామస్వామి దేవస్థానంలో కాలక్షేప మంటపం, రథశాల నిర్మిస్తున్నామని, మహిళలకు ఉచిత దర్జీ శిక్షణ ఇచ్చి 3,456 కుట్టుమిషన్లు ఉచితంగా అందజేస్తామన్నారు. రైతులకు రూ.26లక్షల వ్యయంతో రెండు వేల టార్పాలిన్లు అందజేస్తామని, రూ.1.94 కోట్లు వ్యయంతో 14 రోటోవీటర్లు, 39 పవర్‌టిల్లర్లు, 50 స్ప్రేయర్లు, కిసాన్ డ్రోన్లను రైతులకు అందజేస్తున్నట్టు చెప్పారు. దీనివల్ల 25 వేల ఎకరాల పంటకు ప్రయోజనం కలుగుతుందన్నారు.

గడచిన పది నెలల్లో పిఠాపురం నియోజకవర్గంలో రూ.100 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. తద్వారా 25 వేల మందికి పని కల్పించామని తెలిపారు. మూడు లక్షల మంది ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. పిఠాపురం ఆర్వోబీ నిర్మాణానికి కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ అనుమతిచ్చారని త్వరలోనే టెండర్ల ప్రక్రియ మొదలవుతుందని ప్రకటించారు. ఇటీవల ఢిల్లీ వెళ్లినప్పుడు కేంద్ర రైల్వే మంత్రితో మాట్లాడగా ఆర్వోబీ నిర్మాణానికి నిధులివ్వడానికి అంగీకరించారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్, టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ, కూటమి నేతలతో కలిసి పనిచేస్తామని ప్రకటించారు. శాంతిభద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని పవన్‌కల్యాణ్ స్పష్టంచేశారు. క్రిమినల్స్, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ఏ పార్టీ వారైనా ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు. పవన్‌కల్యాణ్ ఉదయం 9.30 గంటలకు పిఠాపురం చేరుకోవాల్సి ఉండగా మూడు గంటల ఆలస్యంగా 12.27 గంటలకు చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద నాయకులు, జిల్లా అధికారులు స్వాగతం పలికారు. అయితే నాయకులు హెలికాప్టర్ వద్దకు రాగా పైలట్ వారిని వెనక్కు వెళ్లాలని కాస్త విసురుగా చెప్పారు. ఇది చూసిన పవన్ నేతలను హెలీకాప్టర్ వద్దకు రమ్మని, పైలట్ వైపు చూస్తూ నేతలను ఏమీ అనవద్దని సూచించారు. పవన్ రోడ్డు మార్గాన పిఠాపురం వస్తూ యండపల్లి, కొండెవరం, నవఖండ్రవాడ తదితర గ్రామాల్లో రోడ్డు పక్కన ఉన్న వారిని చూసి ఆగి వారి సమస్యలు తెలుసుకున్నారు. పిఠాపురం అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో మహిళల ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభించారు. రైతులకు టార్పాలిన్లు, స్ప్రేయర్లు, రోటావేటర్లు, కిసాన్ డ్రోన్ పంపిణీ చేశారు.ముస్లింలు, మహిళలను కలిశారు. ప్రభుత్వాసుపత్రి ఆవరణలో నియోజకవర్గంలోని సీసీ రోడ్లు, డ్రెయిన్లు, బీటీ రోడ్లు, గోకులాలును ప్రారంభించారు.అనంతరం హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ అరగంటకు పైగా కార్‌వ్యాన్‌లో ఉండిపోయి అనంతరం హెలికాప్టర్‌లో రాజమహేంద్రవరం విమానాశ్రయం, అక్కడ నుంచి విజయవాడ చేరుకున్నారు. ఆయన వెంట కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్, టీటీడీ బోర్డు సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, పెండెం దొరబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, జేసీ రాహుల్ మీనా,జిల్లా ఎస్పీ బిందుమాధవ్, పాడా పీడీ చైత్రవర్షిణి తదితరులు పాల్గొన్నారు.

- మాట నిలబెట్టుకుంటున్నాం
- పిఠాపురం అభివృద్ధి చేస్తున్నాం
- ఆర్వోబీ పనులకు టెండర్లు
- శాంతిభద్రతలపై రాజీ లేదు
- తప్పుచేస్తే ఉపేక్షించం
- పెద్దాసుపత్రికి శంకుస్థాపన
- అంతా కలిసి పనిచేస్తాం
- పవన్ సుడిగాలి పర్యటన

ఆసుపత్రి ఇలా..



పిఠాపురం సీహెచ్‌సీని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన పవన్ వైద్యాధికారులతో మాట్లాడారు. ఆసుపత్రి నిర్మాణం ఏ విధంగ ఉండబోతోందో అధికారులు ప్రజంటేషన్ ఇస్తుండగా.. ఆసుపత్రి అందంగా, ఆరోగ్యంగా ఉండాలంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో పిఠాపురం బిడ్డ పవన్ అని కొందరు నినదించగా నవ్వుకుంటూ ముందుకు సాగారు.

పోలీసులు వర్సెస్ వర్మ

పిఠాపురం అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు వద్ద పోలీసులకు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత ఎస్వీఎస్ఎన్ వర్మ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వర్మతోపాటు వచ్చిన టీడీపీ నేతలను పోలీసులు లోపలకు అనుమతించలేదు. దీనిపై వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిని అనుమతించకపోతే తాను వెళ్లిపోతానని వర్మ హెచ్చరించడంతో ఎస్పీ బిందుమాధవ్ సముదాయించారు.

నిధుల విడుదల ఇలా..

పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లో తాగునీరు, మురుగునీటి వ్యవస్థ మెరుగుదల, ఇతర పనుల నిమిత్తం ప్రత్యేక గ్రాంటుగా మునిసిపల్‌శాఖ మంత్రి నారాయణ రూ.4 కోట్లు మంజూరు చేశారని పవన్ చెప్పారు. వీటితో త్వరలోనే పనులు చేపడతామన్నారు. పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో ఓహెచ్‌ఎస్‌ఆర్, పైప్‌లైన్ల మరమ్మతులు, మురుగునీటి నిర్వహణకు కాకినాడ ఎంపీ నిధులు నుంచి రూ.50 లక్షలు, హౌసింగ్ నుంచి రూ.50 లక్షలు కేటాయించినట్టు చెప్పారు.



నిడదవోలు గణేశ్ చౌక్ సెంటర్‌లో ఉగ్రదాడిపై ముస్లింల నిరసన.. చాగల్లులో మసీదు వద్ద ముస్లింలు ఆందోళన

6

కాల్వలు.. క్లీన్‌గా!



రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజవోలులో పంట కాలువ ఇలా..

వేసవిలో పంట కాల్వలకు మరమ్మతులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం అంటే ఎలా ఉండాలి.. ప్రజల సమస్యలు పరిష్కరించాలి.. ప్రజలకు సమస్యలు రాకుండా చూసుకోవాలి. ప్రస్తుత ప్రభుత్వం అదే చేస్తోంది. దీనిలో భాగంగా పంట కాల్వలపై అభివృద్ధిపై దృష్టి పెట్టింది.. గత వైసీపీ ప్రభుత్వంలో అయితే ఐదేళ్లు ఆ ఊసే లేదు. నీటి సంఘాలను పట్టించుకోలేదు. అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సీజన్‌లో కాలువల ద్వారా నీరందక రైతులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. వైపు భారీవర్షాల వల్ల ముంపు ఏర్పడినపుడు చేలలోని నీరు తిరిగి, బోదుల గుండా బయటకు వచ్చే వీలు లేక నష్టాల పాలయ్యారు. రేపో ఎల్లుండో కాల్వలు కట్టివేయనున్నారు. ఈ నేపథ్యంలో పంట కాల్వల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది.


పంట కాల్వల ఆధునీకరణకు..

ధవళేశ్వరం బ్యారేజి పరిధిలో తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలతోపాటు, వాటి పిల్ల కాలువలు, బోదెలు ఉంటాయి. అవన్నీ శుభ్రంగా, పటిష్టంగా ఉంటేనే నీరుపారుదల సక్రమంగా ఉంటుంది. గోదావరి బ్యారేజీ నుంచి కాలువల్లోకి వెళ్లిన నీరు సులభంగా పంటబోదెల ద్వారా చేలల్లోకి చేరుతోంది. సీఎం చంద్రబాబు నాయుడు ప్రతి ఏటా సమ్మర్‌లో కాలువల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్‌ఎం) నిధులు ఇచ్చి నీటి సంఘాలతో పనులు చేయించేవారు. ఈ ఏడాది అదే విధానాన్ని అవలంభించనున్నారు. ఈమేరకు ముందస్తుగా నీటి సంఘాలను ఎంపిక చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు, కొవ్వూరు డివిజన్‌లో మొత్తం నీటి సంఘాలు 432 ఉన్నాయి. డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ)లు 37, ప్రాజెక్టు కమిటీ (పీసీ)లు 8 ఉన్నాయి. అందులో తూర్పుగోదావరి జిల్లాలో నీటి సంఘాలు 113, డీసీలు 6, పీసీలు 2 ఉన్నాయి. అలాగే అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నీటి సంఘాలు 83, డీసీలు 14, పీసీ 1 ఉంది. కాకినాడ జిల్లాలో నీటి సంఘాలు 236, డీసీలు 17, పీసీలు 5 ఉన్నాయి. ప్రస్తుతం రూ.10 లక్షల్లోపు కాలువల అభివృద్ధి పనులన్నీ వీరి ఆధ్వర్యంలోనే జరగనున్నాయి. డీసీలు,పీసీల సలహాల మేరకు పెద్ద పనులపై అధికారులు నిర్ణయం తీసుకుంటారు.


అసెంబ్లీ	పనులు	నిధులు(కోట్లు)
అమలాపురం	107	3.5 కోట్లు
కాకినాడ రూరల్	53	1.9
కొత్తపేట	68	2.9
మండపేట	67	2.6
ముమ్మిడివరం	85	3.4
పి.గన్నవరం	53	2.4
పెద్దాపురం	51	2.3
రామచంద్రపురం	79	2.9
రాజోలు	61	2.5
జగ్గంపేట	31	2.0
పిఠాపురం		3.9
అనపర్తి	31	1.17
కొవ్వూరు	28	2.02
రాజమండ్రి రూరల్	10	62.8 లక్షలు
ప్రత్తిపాడు	26	99.86 లక్షలు
రంపచోడవరం	3	23.99 లక్షలు
తుని	35	74.98 లక్షలు
గోపాలపురం	16	92.02 లక్షలు

మొత్తం 1747 పనులకు రూ.66.64 కోట్లతో పనులు ప్రతిపాదించారు. రెండు మూడు రోజుల్లో శాంక్షన్ ఉత్తర్వులు వస్తాయని ధవళేశ్వరం సర్కిల్ ఎస్ఈ గోపినాథ్ తెలిపారు. పనులన్నీ ఆయా నియోజకవర్గాల శాసనసభ్యులు, మంత్రుల సలహాలు, సూచనల మేరకు ప్రతిపాదించారు.

- 1747 పనులకు నివేదిక
- 66.64 కోట్ల ప్రతిపాదనలు
- రెండు రోజుల్లో క్లియరెన్స్
- 33 నియోజకవర్గాలపై దృష్టి
- తూడు తొలగింపు చర్యలు
- రేపు కాల్వల మూసివేత
- నీటి సంఘాలకు 10 లక్షల్లోపు
- కాలువల పొడవు 4 వేల కి.మీ



ధవళేశ్వరం వద్ద నిండుగా గోదావరి కాల్వ



రేపు కాలువల మూత

ధవళేశ్వరం సర్కిల్ పరిధిలో తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాలువలకు ఈనెల 27 నుంచి నీటి సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ నేపథ్యంలో కాలువల అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ధవళేశ్వరం గోదావరి పరిధిలోని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వ్యాప్తంగా 33 నియోజకవర్గాల్లో రూ.66.64 కోట్లతో 1747 పనులు చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. రెండు మూడు రోజుల్లో వాటికి అనుమతి తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేయనున్నారు.ఉత్తర్వులు వచ్చిన వెంటనే కాలు వల్లో నీరు తగ్గిన తర్వాత నీటి సంఘాలు పనులు చేపడతాయి.అసెంబ్లీ నియోజకవర్గాల వారీ పనులు గుర్తించారు. అన్ని నియోజకవర్గాల్లో ప్రధాన పంట కాలువలు, పిల్లకాలువలు సుమారు 4 వేల కి.మీ మేర ఉంటాయి.

ధాన్యం దిగుబడిని బట్టి లక్ష్యం ఉండాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం,ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రబీ సీజన్‌లో ధాన్యం దిగుబడి ఆధారంగా ధాన్యం సేకరణ లక్ష్యం నిర్దేశించుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు.కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాత్రి జేసీ ఎస్.చిన్నరాముడు, గెయిల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం. ప్రేమ్ కుమార్, డీఎస్‌వో ఎస్.భాస్కర రెడ్డి, జిల్లా సహకారి అధికారి ఎం. జనార్దన రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, తదితరులతో కలసి ధాన్యం సేకరణపై సమీక్షించారు. గ్రామ స్థాయిలో ఉన్న రైతు సేవా కేంద్రం నుంచి ధాన్యం సేకరణపై పర్యవేక్షణ వ్యవస్థ పటిష్టంగా ఉండాలన్నారు. గెయిల్ డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో కంట్రోలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయా లన్నారు. రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ కొనసాగించాలని సూచించారు. జిల్లా సహకార అధికారి ఆధ్వ ర్యంలో పని చేసే క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది చురుకైన పాత్ర పోషిం చాలని ఆదేశించారు.రైతు సేవా కేంద్రా లకు,బహిరంగ మార్కెట్‌కు సంబంధించిన లావాదేవీలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. సమన్వయ శాఖల అధికారులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలన్నారు.



కలవచర్లలో ఇండస్ట్రియల్ పార్కు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఇండస్ట్రియల్ పార్కు పూర్తి చేయండి

రాజానగరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఇండస్ట్రియల్ పార్కులో పరిశ్రమల స్థాపనకు అన్ని రకాలైన మౌలిక సదుపాయాలను మే1వ తేదీ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులకు ఆదేశించారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కలవచర్లలో 104 ఎకరాల విస్తీర్ణంలో రూ.60.65 కోట్లతో రూపుదిద్దుకోనున్న ఇండస్ట్రియల్ పార్కును ఏపీఐఐసీ అధి కారులతో కలిసి శుక్రవారం సందర్శించారు. పారిశ్రామికవాడలో అభివృద్ధి పనులు స్వయంగా పరిశీలించారు.పారిశ్రామిక ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ తదితర సౌకర్యాలతో దాదాపు 80 శాతం మేర ఇప్పటికే అభివృద్ధి పనులు పూర్తయినట్లు కలెక్టర్ చెప్పా రు. పరిశ్రమల స్థాపనకు ఆయా కేటగిరీల వారిగా సబ్సిడీ సదుపాయం కల్పించే యో చనలో ప్రభుత్వం ఉందన్నారు. ఈ కార్య క్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ రమణా రెడ్డి, డిప్యూటీ జోనల్ మేనేజర్ సుధారాణి,ట్రాన్స్‌కో ఎస్ఈ తిలక్, జిల్లా అధికారులు రమణ, కుమార్, ఎన్‌పీ సత్యనారాయణ, రాజా నగరం తహశీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతి దేవి, ఏఈ సుధాకర్ తదితరులు ఉన్నారు.

డీపీఆర్‌వోగా బాలకృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా పౌర సంబంధాల అధికారిగా వై.బాలకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం బాధ్యతలు స్వీకరించి ఆయన జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిశారు. బాపట్ల జిల్లా చెరుకుమిల్లి మండలం ఆరేపల్లికి చెందిన బాలకృష్ణ ఆయన పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్శిటీలో మాస్టర్ ఇన్ జర్నలిజం చేశారు. 2022లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో ఉత్తీర్ణుల య్యారు.తూర్పుగోదావరి జిల్లాకు బాలకృష్ణను డీపీఆర్‌వోగా ప్రభుత్వం నియమించింది.

భూసార పరీక్షలు తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

గోపాలపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి భూసార పరీక్షలు తప్పనిసరి అని జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు అన్నారు. మండలంలోని చిట్యాల రైతుసేవా కేంద్రంలో జిల్లాస్థాయి వ్యవసాయాధికారులకు భూసార పరీక్షలపై ఒక్కరోజు శిక్షణ శుక్రవారం నిర్వహించారు. ప్రతి ఏడాది భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా భూమి స్థితిగతులు రైతులకు అవగతం అవుతాయన్నారు.జిల్లాలో ఈ ఏడాది 24321 మట్టి నమూనాలు సేకరించడం లక్ష్యంగా నిర్దేశించుకు న్నామన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది మే నెల 15వ తేదీలోపు నమూనాలు సేకరి ంచాలన్నారు. సుస్థిర దిగుబడులు పొందడానికి భూసారపరీక్షలు దోహదం చేస్తాయని రైతులు ప్రభుత్వం ఉచితంగా చేపడుతున్న భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ జయరామలక్ష్మి, 19 మండలాల వ్యవసాయాధికారులు, నాలుగు డివిజన్ల ఏడీఏలు, ప్రకృతి వ్యవసాయ ఏడీఏ తాతారావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ఓపీ పెంచండి

వైద్యులకు కలెక్టర్ ఆదేశం



రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 15 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని వైద్యసేవలు పూర్తిస్థాయిలో అందించాలని, ఓపీ సేవలు మరింత పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, గర్భిణులు, పిల్లలకు సంబంధించిన సేవలు, ల్యాబ్ టెస్టులు సంపూర్ణంగా అందించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాత్రి పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలపై సంబంధిత వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏఎన్ఎంలతో పాటు వైద్య సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లకు ఇతర పనులు అప్పగించకుండా, పూర్తిగా ఆరోగ్యకేంద్రాల్లోనే వారి సేవలు ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. హాస్పటల్ అభివృద్ధి కమిటీ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు,మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వినూత్న, వైద్యాధికారులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న జేసీ చిన్నరాముడు

'పండ్లపై రసాయనాలు ఆరోగ్యానికి హానికరం'

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : వ్యాపారస్తులు నిషేధిత కాల్షియం కార్బైడ్ వంటి రసాయనాలతో కృత్రిమంగా పండ్లను మాగబెడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జేసీ ఎస్.చిన్నరాముడు హెచ్చరించారు. పండ్లను కృత్రిమంగా రసాయనాలతో మాగబెట్టడం ఆరోగ్యానికి హానికరం అన్నారు.శుక్రవారం జేసీ సమావేశ మందిరంలో జేసీ చిన్నరాముడు వివిధ సమన్వయశాఖల అధికారులతో జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. రైతులు, వ్యాపారస్తులు, వినియోగదారులకు ఈనెల 26వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు రాజమహేంద్రవరం మార్కెట్ యార్డులో అవగాహన కల్పిస్తామని వెల్లడించారు.మామిడి, ఇతర పండ్లను కృత్రిమంగా పండ్లను మాగబెట్టడం వల్ల ఆరోగ్యపరమైన నష్టాలు జరుగుతాయన్నారు.సమావేశంలో జిల్లా ఆహారభద్రత అధికారి రుక్కయ్య, మార్కెటింగ్‌శాఖ జిల్లా అధికారి సునీల్ వినయ్ పాల్గొన్నారు.

ఊరిస్తోంది..
ఊరగాయ!





వేసవికాలం వచ్చిందంటే గోదావరి జిల్లాల్లో ఊరగాయల సందడి వచ్చేస్తుంది. ముఖ్యంగా ఆవకాయకు కేరాఫ్ అడ్రస్‌గా రాజమహేంద్రవరం ఉంటుంది. ఇతర ప్రాంతాలతో పోల్చితే రాజమహేంద్రవరం పరిసర గ్రామాల్లో మామిడి పంట అధికంగా ఉండడమే కారణం. మామిడితోపాటు టమాట, మిర్చి ఆవకాయ, దబ్బకాయ, నిమ్మకాయ, ఉసిరికాయ, ములక్కాయ, గోంగూర, కొత్తిమీర, పచ్చళ్లు ఎండాకాలంలోనే పట్టడానికి అనుకూలం. అందుకే వేసవికాలం ఊరగాయల కాలం అని మన పెద్దలు అంటుంటారు.

- ఎక్కడ చూసినా పచ్చళ్ల హడావుడే.. మార్కెట్‌లో అంతా ఇదే సందడి
- పచ్చడి రకం మామిడికాయ రూ.10 నుంచి రూ.25 వరకు ధర

రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజలు అమితంగా ఇష్టపడే ఆహార పదార్థాల్లో పచ్చళ్లు కూడా చాలా ముఖ్యం. వేసవికాలంలో పచ్చళ్లు పడితే మూడు కాలాలపాటు అవి నిలిచి ఉండి మళ్లీ పచ్చళ్లు పట్టే సమయానికి జాడీలు అడుగంటుతాయి. ఆ విధంగా నాన్నమ్మలు, తాతమ్మలు, అమ్మమ్మలు పచ్చళ్లను నిల్వ చేసుకునేలా సిద్ధం చేసేవారు. అందుకే వేసవి ఆరంభంతోనే పచ్చళ్ల సందడి ప్రతి ఏటా మొదలవుతుంది. రాజమహేంద్రవరం ఆవకాయపచ్చడి మార్కెట్లు చాలా ప్రసిద్ధి. పచ్చడి సరుకులన్నీ హోల్‌సేల్ ధరలకే ఇక్కడ లభ్యమవడం, అన్ని రకాల పచ్చడి మామిడికాయ కూడా పెద్దఎత్తున దిగుమతి కావడంతో సమీప ప్రాంతాల నుంచి ఈ సీజన్‌లో మార్కెట్‌కు తరలివస్తారు. పట్టిన పచ్చళ్లు కొనుగోలు చేసుకునే సంస్కృతి పెరుగుతున్నా ఇప్పటికీ అన్ని రకాల నాణ్యమైన దినుసులతో, గానుగ నూనెతో ఊరగాయలు పట్టడానికే ఎక్కువమంది మొగ్గుచూపుతున్నారు. పాత పద్ధతినే అనుసరిస్తూ కష్టమైనా పచ్చడి పట్టుకుని తమతోపాటు బంధుమిత్రులకు పంపించే పరిస్థితీ కొనసాగుతోంది. ధరలు అంతకంతకూ పెరుగుతుండడంతో తక్కువ పరిమాణంలోనైనా ఆవకాయ, మాగాయ పట్టుకోవాలని చాలామంది ఏర్పాట్లు చేసుకుంటున్నారు. సగటున 25 మామిడికాయలు కొనుగోలు చేసుకుని వాటిలోకి పచ్చడి మిరపకాయలు కిలో రూ.300కు కొనుగోలు చేసి వాటిలోకి నువ్వుల నూనె లేదా వేరుసెనగ నూనెను వాడుకునేలా సిద్ధం చేసుకోవడంతోపాటు వెల్లుల్లి, ఆవాలు, మెంతులు తదితర పచ్చడి దినుసులన్నీ కొనుగోలు చేసుకోవడానికి మొత్తం రూ.3 వేల వరకు ఖర్చవుతోంది.

మార్కెట్ యార్డుకు పోటెత్తుతున్న మామిడి



ఆవకాయ పేరుచెబితే మామిడితో కొన్ని రకాల కాయలకు ప్రత్యేకమైన డిమాండ్ ఉంటుంది. రాజమహేంద్రవరం మార్కెట్‌లో ఆవకాయ, మాగాయ, తొక్కుడు, బెల్లం ఆవకాయ పచ్చళ్లకు అవసరమైన మామిడికాయలు అందుబాటులో ఉన్నాయి. ఆవకాయకు కొత్తపల్లి కొబ్బరి బాగా ఫేమస్. ఆ తర్వాత నీలాలు, రసాలను వినియోగిస్తారు. ప్రస్తుతం మార్కెట్‌కు ఆయా రకాల మామిడికాయలు చేరుకుంటున్నాయి. అయితే రాజమహేంద్రవరం మార్కెట్‌కు దూర ప్రాంతాల నుంచి మామిడికాయలను దిగుమతి చేసుకునే అవసరం లేదు. ఎందుకంటే తూర్పుగోదావరి జిల్లాలోనే గోకవరం, కోరుకొండ, రాజానగరం మండలాల్లోనే పెద్దఎత్తున మామిడి తోటలు ఉన్నాయి. ఈ తోటల నుంచే మామిడి కాయలు రాజమహేంద్రవరం మార్కెట్ యార్డుకు ప్రతి ఏటా తరలివస్తాయి. ప్రస్తుతం మార్కెట్‌లో సరుకు దిగుమతి ఊపందుకుంది. ప్రస్తుత మార్కెట్‌లో పచ్చళ్లకు వినియోగించే మామిడి కాయల ధరలు కాయ రూ.10 మొదలుకొని రూ.25 వరకు ఉంది. రకాలు, వాటి నాణ్యతను బట్టి రేట్లు పెరుగుతున్నాయి. కొత్తపల్లి కొబ్బరి మామిడి కాయ ఒకటి రూ20 వరకు పలుకుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో పచ్చడి కాయల సందడి కూడా మొదలైంది. మే మొదటి వారంలో మరింతగా పచ్చడి కాయలకు డిమాండ్ పెరగనుంది. ఇప్పటికే కాయలు కొనుగోలు చేసుకుని వాటిని ముక్కలు కొట్టే వారి వద్దకు తీసుకుని వెళ్లి నచ్చిన సైజులో ముక్కలు కొట్టించి పచ్చడి పట్టుకునే పనిలో మహిళలు నిమగ్నమయ్యారు.

హామీ నెరవేర్చారు!



కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావును సత్కరిస్తున్న వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయ నాయీబ్రాహ్మణులు

నాయీబ్రాహ్మణులకు కనీస వేతనం రూ.25 వేలు.. జీవో జారీచేసిన ప్రభుత్వం

ఆత్రేయపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల్లో నాయీబ్రాహ్మణులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అమలుచేశారు. ఎన్నో ఏళ్లుగా దేవుడి సేవలో ఉంటూ నాయీబ్రాహ్మణ వృత్తినే కొనసాగిస్తూ వస్తున్న వారికి రూ.25 వేలు కనీస వేతనంగా అమలుచేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుని జీవో జారీచేసింది. ఈ జీవోపై నాయీబ్రాహ్మణులు హర్షాతిరేకాలు వ్యక్తంచేస్తున్నారు. రూ.50లక్షల నుంచి రూ.2 కోట్ల వరకూ ఆదాయం వచ్చే 44 దేవాలయాలు 'ఏ' కేటగిరిలో ఉన్నాయి. వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి పుణ్యక్షేత్రం డిప్యూటీ కమిషనరు హోదాకు చేరుకుంది. వార్షిక ఆదాయం రూ.30 కోట్లపైమాటే. గతంలో శ్రీ వేంకటేశ్వర నాయీబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సుమారు 17 మంది ఎన్నో ఏళ్లుగా భక్తులకు తలనీలాలు తొలగించే సేవలో కొనసాగారు. గతంలో టిక్కెట్టు రూ.25కు తలనీలాల సమర్పించే భక్తుల నుంచి సేకరించగా ఆ టిక్కెట్టు కమిషను రూ.25 నాయీబ్రాహ్మణులకు అందించేవారు. ఇలా నెలకు రూ.7వేల నుంచి రూ.8 వేల ఆదాయం వచ్చేది. ఆ కమిషన్‌తోనే కుటుంబాలు పోషించుకునేవారు. ఏళ్ల తరబడి పనిచేస్తున్న వీరి సేవలను గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం దృష్టికి తీసుకునివెళ్లడంతో గత ప్రభుత్వం రూ.20 వేల వేతనం అందించింది. దీన్ని కూటమి ప్రభుత్వం రూ.25 వేల వేతనానికి పెంచుతూ తాజాగా జీవో జారీచేసింది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావును వీరంతా సత్కరించారు.





కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

ఎన్నో ఏళ్లుగా దేవుడి సేవలో నిమగ్నమై ఉన్న తమకు కనీస వేతనం కోసం పోరాటం సాగించాం. చాలీచాలని వేతనాలతో దేవుడినే నమ్ముకుని భక్తులకు సేవలందిస్తూ వచ్చాం. ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం రూ.25 వేలు కనీస వేతనం పెంచుతూ జీవో జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నాం. **- రౌతు సురేష్, వెంకటేశ్వర నాయీబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు, వాడపల్లి**

అన్నవరం దేవస్థానంలో 74 మంది నాయీబ్రాహ్మణులకు శుభవార్త

అన్నవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్య క్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో కేశఖండనశాల నాయీబ్రాహ్మణులకు కూటమి ప్రభుత్వం తీపికబురు అందించింది. దేవస్థానంలో 74 మంది నాయీబ్రాహ్మణులుండగా వీరికి దేవస్థానం నుంచి రూ.20వేల వేతనం అందిస్తున్నారు. చంద్రబాబు ఎన్నికల హామీల్లో భాగంగా ఈ వేతనాన్ని రూ.25వేలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పెంచిన జీతాలు జూన్ నుంచి అమలులోకి రానున్నాయి. మొదట్లో నాయీబ్రాహ్మణులు కేశఖండన టిక్కెట్లపై వచ్చే కమిషన్‌తో విధులు నిర్వహించేవారు. మొదట్లో రూ.2 కమిషన్ ఉండగా క్రమేపీ రూ.25కి పెంచారు. వైసీపీ ప్రభుత్వం దాన్ని రూ.20 వేల వేతనంగా మార్చగా, కూటమి ప్రభుత్వం రూ.25వేలకు పెంచింది.

ఈనెల 29 నుంచి వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలు

- జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ నరసింహారావు



దివాన్‌చెరువు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పడి 60 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈనెల 29 నుంచి రెండు రోజులపాటు వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తూర్పుగోదావరిజిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ చల్లా వెంకటనరసింహారావు తెలిపారు. దీనికి సంబంధించి శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. గుంటూరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, లాంఫాం ఆడిటోరియంలో వర్సిటీ వీసీ శారద జయలక్ష్మీదేవి ఆధ్వర్య22ంలో ఈ ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈ వజ్రోత్సవాలకు ముఖ్యఅతిథులుగా గవర్నర్ ఎస్.అబ్దుల్‌నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ హాజరవుతారని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలోని శాస్త్రవేత్తలు అందరూ పాల్గొంటారని తెలిపారు. తొలి రోజు వ్యవసాయ, అనుబంధ విభాగాల్లో అంతర్జాతీయంగా చోటుచేసుకొంటున్న మార్పులు గురించి సదస్సు జరుగుతుందన్నారు. రెండో రోజున 30వ తేదీన అభ్యుదయ రైతులతో వ్యవసాయ వర్సిటీ ద్వారా 60 సంవత్సరాల నుంచి రూపొందించిన కొత్తవంగడాలు, సాంకేతిక పరిజ్ఞానంపై చర్చ జరుగుతుందని తెలిపారు. రైతులు, వ్యవసాయ విశ్వవిద్యాలయంలో చదివిన పూర్వ విద్యార్థులు ఈ అవకాశంను వినియోగించుకోవాలని నరసింహారావు విజ్ఞప్తి చేశారు.

స్థానికులకు ఉద్యోగాలు కల్పించకుండా ఓఎన్జీసీ చమురు తరలించుకుపోతోంది

- టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనందసాగర్

కాకినాడసిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కోనసీమ ప్రాంతంలోని స్థానికులకు ఉద్యోగాలు కల్పించకుండా ఓఎన్జీసీ పైప్‌లైన్ల ద్వారా చమురు నిక్షేపాలను తరలించుకుపోతోందని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మోకా ఆనందసాగర్ మండిపడ్డారు. ఈమేరకు శుక్రవారం విడుదలచేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ కోనసీమజిల్లా అమలాపురం నియోజకవర్గం ఓడలరేవు గ్రామంలోని ఓఎన్జీసీ టెర్మినల్ దగ్గర కోనసీమ నిరుద్యోగ యువత ఆధ్వర్యంలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలని నిరసన దీక్షలు చేపట్టి కొనసాగిస్తున్నారన్నారు. దీనిపై ఓఎన్జీసీ స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు ఉదాసీనంగా వ్యవహరిస్తూ తన అధికారాన్ని, బలాన్ని ఉపయోగించి ఏదోవిధంగా దీక్షా శిబిరాన్ని ఎత్తివేయించాలని ప్రయత్నిస్తోందన్నారు. ఈ విధమైన ఓఎన్జీసీ వైఖరిని తెలుగు దేశంపార్టీ తీవ్రంగా తప్పుపడుతోందని, స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని బలంగా డిమాండ్ చేస్తోందన్నారు. కొన్ని దశాబ్దాలుగా కోనసీమ సముద్రతీరంలోని సంపదనంతా ఓఎన్జీసీ తవ్వకుని ఎత్తుకుపోతోందని, పైప్‌లైన్ల ద్వారా సముద్రగర్భం నుంచి తరలించుపోతోందన్నారు. కోనసీమ నిరుద్యోగ యువత మంచితనాన్ని చేతకానితనంగా భావిస్తే ఓఎన్జీసీ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈసారి ఇక్కడున్న పార్లమెంట్ సభ్యుడికి చమురు సహజ నిక్షేపాల అథారిటీలో డైరెక్టర్ పదవి ఇవ్వకుండా ఎక్కడో బందరులో ఉన్న పార్లమెంట్ సభ్యుడికి ఈ పదవి ఇచ్చారన్నారు. ఆయిల్, గ్యాస్ పట్టుకుపోయేది ఇక్కడి నుంచేనని, స్థానిక పార్లమె ంట్ సభ్యుడికి ఈ కమిటీలో డైరెక్టర్ పదవి ఇవ్వకపోవడం ఎంతో అవమానమన్నారు.

పచ్చని గొడుగులా...

- గోకవరం-రంపయర్రంపాలెం రహదారి

గోకవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఎండ వేడిమి ఎక్కు వగా ఉన్నపుడే చెట్టు విలువ తెలుస్తోంది. కాసేపు ఆ చెట్టు కింద సేదతీరి తిరిగి ప్రయాణం కొనసాగించాలనిపిస్తోంది. గోకవరం-రంపయర్రంపాలెం ప్రధాన రహదారిలో వెళితే ఇదే అనుభూతి కలుగక మానదు. ఆ రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పచ్చనిచెట్లు ప్రయాణికులకు ఎంతో ఉపసమనాన్ని కల్గిస్తున్నాయి. సాయంత్రం వేళ ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి.



గోకవరం-రంపయర్రంపాలెం రహదారి మధ్యలో పచ్చని చెట్లు

కంచి విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు

- రేపు కాకినాడ చల్లా కల్యాణ మండపంలో అవగాహన సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న వేద పురోహితులు ఆకెళ్ల మురళీకృష్ణశర్మ

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కంచిలోని కామకోటి యూనివర్శిటీకి చెందిన చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేట్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్స్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కంచి పీఠం ప్రతినిధి, వేద పురోహితులు ఆకెళ్ల మురళీ కృష్ణశర్మ తెలిపారు. దీని నిమిత్తం యూనివర్శిటీ విశ్వవిద్యాలయ యాజమాన్య, అధ్యా పకులతో ఈనెల 27వ తేదీన కాకినాడ విద్యుత్‌నగర్‌లో ఉన్న చల్లా కల్యాణ మండపంలో ఉదయం 10నుంచి 5గంటల వరకు అవగాహన సదస్సులో చేరేందుకు ప్రవేశాల దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. శుక్రవారం చల్లా కల్యాణమండపంలో ఆకెళ్ల మురళీకృష్ణ విలేకరుల సమావేశంలో మా ట్లాడారు. ఈ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ధర్మం ఎలా ఉండాలో జీవితంలో ఎలా ఉన్నతస్థితికి చేరాలనేది, క్రమశిక్షణకు సంబంధించి విద్యను నేర్పుతారన్నారు. ఇంజనీరింగ్ విద్యతోపాటుగా ఇంకా ఎంసీఏ, ఎంబీఏ, ఎంటెక్ వంటి విద్యను బోధిస్తారన్నారు. విద్యార్థులకు ఉపకరణాలు హాస్టల్ వంటి సదుపాయాలు ఈ కంచి పీఠం ఆధ్వర్యంలో జరిగే ఈ విశ్వవిద్యాలయంలో విద్యార్థుల్లో విద్యను అభ్యసించడం ద్వారా ధర్మం, మంచి అలవాట్లు కలుగుతాయన్నారు. తద్వారా వారు ఉన్నత స్థితికి చేరి ఉద్యోగంలో రాణించవచ్చని చెప్పారు. తిరుపతిలో కంచి పీఠం ఆధ్వర్యంలో పాఠశాలలో బ్రాహ్మ ణ బాలికలకు ఉచిత విద్యనందిస్తున్నట్లు తెలిపారు. కంచి ఆధ్వర్యంలో సీబీఎస్ సిలబస్ చెన్నై, పొదిలి ఇంకా తెలంగాణ వంటి ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలో విద్యను బోధిస్తున్నట్లు మురళీకృష్ణ చెప్పారు. కంచి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు చేరి తమ ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఆకెళ్ల మురళీకృష్ణ తెలిపారు. ఈ సమావేశంలో బ్రాహ్మణ సంఘం నాయకులు చల్లా నిరంజన్ శ్రీనివాస్, దేవత పుత్రరావు, ఎస్.శ్రీరామచంద్రమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

రండి కలిసి పనిచేద్దాం

- వర్మ చేయి పట్టుకుని తీసుకుని వెళ్లిన డిప్యూటీ సీఎం పవన్
- పిఠాపురంలో ఆసక్తికర సన్నివేశం

పిఠాపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటన సందర్భంగా శుక్రవారం ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. పట్టణంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలువద్ద ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం, వ్యవసాయ పనిముట్లు పంపిణీ కార్యక్రమానికి వచ్చిన పవన్ అక్కడేఉన్న వర్మనుచూసి ఆగి చేయిపట్టుకుని లోపలకు తీసుకువెళ్లారు.శిక్షణ ప్రారంభానికి సూచికగా రిబ్బన్‌కట్‌చేసే సమయంలో ఎంపీ ఉదయశ్రీనివాస్‌తోపాటువర్మను రిబ్బన్ పట్టుకోవాలని సూచించారు. నియోజకవర్గాభివృద్ధికి ఎంపీ ఉదయ్, వర్మ, జనసేన నేతలు కలిసి పనిచేస్తామని పవన్ ప్రకటించారు.



పిఠాపురంలో మాజీ ఎమ్మెల్యే వర్మ చేయి పట్టుకుని తీసుకుని వెళ్తున్న పవన్‌కల్యాణ్

టెన్త్, సివిల్స్ టాపర్లకు పవన్ అభినందన



టెన్త్ టాపర్‌గా నిలిచిన నేహాంజని, జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని తోట పుష్పాంజలిలను అభినందిస్తున్న డిప్యూటీ సీఎం



సివిల్స్‌లో 94వ ర్యాంకు సాధించిన చక్కా స్నేహిత్‌ను అభినందిస్తున్న పవన్‌కల్యాణ్

పిఠాపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో 600కి 600 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రికార్డు సృష్టించిన కాకినాడకు చెందిన యాళ్ల నేహాంజనిని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అభినందించారు. పిఠాపురం పర్యటనలోఉన్న పవన్‌ను ఆమె కలిసింది. గొల్లప్రోలు జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని తోట పుష్పాంజలి టెన్త్ పరీక్షల్లో 594 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో కాకినాడ జిల్లాలో రెండో ర్యాంకులో నిలిచారు. పుష్పాంజలిని పవన్ అభినందించారు. ఇద్దరు భవిష్యత్తులో ఉన్నతస్థానాలకు ఎదగాలని ఆశీర్వదించారు.

సివిల్స్ ర్యాంకర్‌కు అభినందనలు

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన సివిల్స్‌లో 94వ ర్యాంకు సాధించిన పిఠాపురం పట్టణానికి చెందిన చక్కా స్నేహిత్‌ను పవన్‌కల్యాణ్ అభినందించారు. పిఠాపురంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలువద్ద పవన్‌ను అతడు కలిశారు. సివిల్స్‌లో ర్యాంకు సాధించడం ముదావహమన్నారు.

నా కుమార్తెను కాపాడరూ

- డిప్యూటీ సీఎంను కలిసేందుకు వచ్చిన దంపతులు



కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కుమార్తెను ఆదుకోవాలని కోరుతున్న దంపతులు

పిఠాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం చొరవ తీసుకుని తమ కుమార్తెను కాపాడాలని ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన సూర్య దంపతులు కోరారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కుమార్తెను తీసుకుని వారు పిఠాపురం వచ్చారు. పవన్ కలిసే అవకాశం లభించకపోవడంతో అధికారులకు వినతిపత్రం ఇచ్చారు.

ఇన్సెంటివ్ బకాయిలు విడుదల చేయరూ

పట్టురైతులకు ఐదేళ్లనుంచి రావాల్సిన రూ.3కోట్ల ఇన్సెంటివ్ బకాయిలను తక్షణం విడుదల చేయాలని పట్టు రైతులు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కోరారు. పట్టు రైతులకు గతంలో అమలులో ఉన్న రాయితీలు అన్నింటినీ పునరుద్ధరించాలని, రవాణా చార్జీలను చెల్లించాలని, దళారులవల్ల మోసపోయి న రైతులకు రూ.34లక్షల సొమ్ము ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

రెల్లి కులస్తులకు న్యాయం చేయాలి

ఎస్సీ వర్గీకరణలో భాగంగా రెల్లి, ఉపకులాలుకు కేవలం 1శాతం రిజర్వేషన్ కేటాయించడం అన్యాయమని రెల్లికులరిజర్వేషన్ సాధన సమితి ప్రతినిధులు అన్నారు. కనీసం 2 నుంచి 3శాతం రిజర్వేషన్‌ను ప్రత్యేకంగా రెల్లి కులానికి కేటాయించాలని, రెల్లి కులస్తుల అభి వృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు.

రచ్చబండ రద్దు

- వినతుల స్వీకరణకు ప్రత్యేక ఏర్పాట్లు

పిఠాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పాల్గొనాల్సిన రచ్చబండ కార్యక్రమం రద్దయింది. దీంతో వివిధ సమస్యలపై వినతులు ఇద్దామని వచ్చిన ప్రజలు నిరాశకు గురయ్యారు. వారినుంచి వినతలు స్వీకరించేందుకుగాను పిఠాపురం ప్రభుత్వాసుపత్రివద్ద ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. వారి నుంచి వినతులు తీసుకుని రశీదులు ఇచ్చారు.



వినతుల స్వీకరణకు ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్

ఆహ్వానపత్రిక ఆవిష్కరణ

పిఠాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ పట్టణ పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అక్కడి భాస్కర్‌నగర్‌లో నూతనంగా నిర్మించతలపెట్టిన కల్యాణ మండపం శంకుస్థాపన ఆహ్వానపత్రికలను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్, శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆవిష్కరించారు.



కల్యాణమండపం శంకుస్థాపన ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

రేపు తిరుమలలో అవగాహన సదస్సు

రాజమహేంద్రవరంరూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులో తిరుమల విద్యాసంస్థల్లో ఆదివారం 6,7,8,9,10 తరగతుల్లోకి రాబోయే విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తిరుమల విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఐఐటీ అండ్ మెడికల్ ఫౌండేషన్‌పై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నామని ఆ సంస్థ ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. తిరుమల క్యాంపస్‌లో ఈనెల 27న ఉదయం 10నుంచి సదస్సు జరుగుతుందని, తమ పిల్లల భవిష్యత్‌లో ఐఐటీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మకమైన జాతీయస్థాయి కళాశాలలో విద్యనభ్యసించాలంటే స్కూల్‌స్థాయి నుంచే ఎలా సంసిద్ధమవ్వాలో ఈ సదస్సులో వివరిస్తారని తెలిపారు. సమాచారంకోసం 7997071672, 8309076048ను సంప్రదించాలని కోరారు.

రెండోరోజు కొనసాగిన ఉపాధ్యాయుల ధ్రువపత్రాల జారీ

కాకినాడక్రైం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీ ప్రక్రియలో భాగంగా శుక్రవారం రెండోరోజు ఉపాధ్యాయులకు కాకినాడ జీజీహెచ్‌లో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల పరిధిలో బదిలీ కోరుకునే ఉపాధ్యాయులకు జీజీహెచ్‌లో జనరల్ మెడిసిన్, గుండె, కంటి, న్యూరో, ఆర్థో, మానసిక వైద్య విభాగాలకు చెందిన వైద్యుల పర్యవేక్షణలో ఉపాధ్యాయులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులుకు వైద్య ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసన్, ఆర్ఎంవో డాక్టర్ లావణ్య, సీఎస్ఆర్ఎంవో రాజకుమారిలు పాల్గొన్నారు.

వెటర్నరీ డాక్టర్లు... మూగజీవాల దైవాలు!

నేడు ప్రపంచ పశువైద్య దినోత్సవం

కాకినాడ క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మూగజీవాలైన పశు, జంతు సంరక్షణలో పశు వైద్యుల (వెటర్నరీ డాక్టర్ల) పాత్ర కీలకం. ఈ ఏడాది ఏప్రిల్ నెల నాల్గో శనివారం పశు వైద్య దినోత్సవం. ఈ రోజున పశు, జంతువుల ఆరోగ్యం, సంరక్షణ ముఖ్యంగా జంతు హింసను నిరోధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన పెంచడమే లక్ష్యంగా కార్యక్రమాలను నిర్వహిస్తారు. పెంపుడు జంతువుల సంరక్షణకు సంబంధించిన అనేక అంశాలపై పెంపుడు జంతువుల యజమానులకు అవగాహన కల్పిస్తారు.

ఎప్పుడు ప్రారంభం..

1863వ సంవత్సరంలో మొట్టమొదటి సారిగా యూరోపియన్ వెటర్నరీ డాక్టర్ల ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జాన్‌జామ్‌జీ వెటర్నరీ కాలేజీలో ఈ వరల్డ్ వెటర్నరీ డేను నిర్వహించారు. అనంతరం 1959లో మాడ్రిడ్‌లో వరల్డ్ వెటర్నరీ అసోసియేషన్ స్థాపించారు. ప్రస్తుతం 70 కంటే ఎక్కువ ప్రపంచ దేశాలు వెటర్నరీ అసోసియేషన్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. అనంతరం 2001 సంవత్సరంలో ప్రపంచ వెటర్నరీ అసోసియేషన్ ఏప్రిల్ నాల్గో శనివారం నాడు ఈ పశు వైద్య దినోత్సవాన్ని జరుపుకునేందుకు నిర్ణయించింది.

ఇదే లక్ష్యం...

ప్రపంచ పశు వైద్య దినోత్సవం లక్ష్యం వెటర్నరీ సైన్సులో యువత ప్రత్యేక శ్రద్ధ వహించి నైపుణ్యతను పెంపొందించుకోవాలి. ముఖ్యంగా ఎవరూ పట్టించుకోని జంతువులకు జీవన పరిస్థితులను కల్పించి వాటి ఎదుగుదలను వెటర్నరీ వైద్యులు మెరుగుపరుస్తున్నారు. జంతువుల ద్వారా సంక్రమించే వ్యాధులపై, అలాగే పెంపుడు జంతువులకు రోగనిరోధక శక్తిని ఎలా అందించాలో తదితర అంశాలపై అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నారు. ముఖ్యంగా పశువులు అనారోగ్యానికి గురైనప్పుడు, ప్రమాదం పాలై గాయపడినప్పుడు వాటికి చికిత్సను అందజేయడంలో పశు వైద్యుని పాత్ర కీలకం. జంతువుల ఆరోగ్యాన్ని కాపాడడంలో పశు వైద్యుల పాత్ర మానవ శ్రేయస్సుపై ప్రభావంచూపుతుంది.

పశు వైద్యుల సేవలు అభినందనీయం



పశువులు, పెంపుడు జంతువులు, పౌల్ట్రీఫారంలలో వచ్చే సీజనల్ వ్యాధులు, అనారోగ్యాలు, ప్రమాదాల పరంగా ఏర్పడే గాయాలకు చికిత్సను అందించడంలో వెటర్నరీ డాక్టర్‌లు దైవాలతో సమానం. కాకినాడ జిల్లా వ్యాప్తంగా ఆవులు 76,502 ఉండగా గేదెలు 2,82,273 ఉన్నాయి. అలాగే గొర్రెలు 1,41,229 ఉండగా మేకలు 1,01, 870 ఉన్నాయి. అలాగే పౌల్ట్రీకి సంబంధించి బ్రాయిలర్, ఫారం కోళ్ళు కలిపి 92,48,636 ఉన్నాయి. అలాగే 33,726 పెంపుడు కుక్కలు ఉన్నాయి. వీటన్నింటికి వైద్యచికిత్స, సేవలు అందిస్తున్న పశు వైద్యుల సేవలు అభినందనీయం.

డాక్టర్ వెంకటేశ్వరరావు జాయింట్ డైరెక్టర్, పశు సంవర్ధకశాఖ, కాకినాడ

చంపుతామంటూ బెదిరించి దోపిడీ చేసిన నలుగురి అరెస్టు

పరారీలో మరో ఇద్దరు

కోటనందూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కోటనందూరు మండలం కాకరాపల్లి స్పైసీ హోటల్ వద్ద ఈనెల 22న తెల్లవారుజామున ఇద్దరు యువకులను చంపుతామంటూ బెదిరించి వారి వద్ద దోచుకొన్న వస్తువులతో పరారైన ఆరుగురు వ్యక్తుల్లో నలుగురుని కోటనందూరు పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన అల్లాడి నాగేంద్రసాయి, గాలంకి కిరణ్‌బాబు లంబసింగి విహారయాత్రకు వెళ్లి తిరివస్తుండగా కాకరాపల్లి వద్ద అరుగురు వ్యక్తులు రెండు



కోటనందూరు పోలీస్‌స్టేషన్‌లో నిందితులు

స్కూటీలపై వచ్చి వారిని బ్యాట్‌తో అడ్డగించి చెంపపై కొట్టారు. వారి వద్ద ఉన్న బజాజ్ పల్సర్ బైక్, 2 మొబైల్ ఫోన్లు, దుస్తుల బ్యాగ్, రూ.1400 నగదు పట్టుకునిపోయారు. దీంతో బాధితులు పోలీస్‌లకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. స్పెషల్ క్లూస్ టీం రంగంలోకి దిగి నిందితుల కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. నిందితుల్లో కాకినాడకు చెందిన పట్టెంకామరాజు, గుటూరి సాయి దుర్గాప్రసాద్, సంగు నాగవెంకట భవాని కుమార్, చింతా పవన్‌కళ్యాణ్‌తో పాటు చల్లా నాగ శివమణికంఠ, ఏనుగుపల్లి రాజు ఉన్నారు. వారందరు శుక్రవారం అనకాపల్లి జిల్లా నాతవరం మండలం గాంధీనగరం- తాండవ జంక్షన్ మధ్య ఫారెస్ట్ టేక్ ప్లాంటేషన్ వద్ద గుమికూడి ఉండడంతో పోలీసులకు సమాచారం అందింది. వెంటనే కోటనందూరు సీఐ జిచెన్నకేశవరావు, ఎస్ఐ టి.రామకృష్ణ, సీపీఎస్ ఎస్ఐ అంకబాబు ఆధ్వర్యంలో అక్కడకు వెళ్లి నలుగురు వ్యక్తులను పట్టుకున్నారు. ఏనుగుపల్లిరాజు, చల్లా నాగశివ మణికంఠ పరారీలో ఉన్నారు. అరెస్టు చేసిన నిందితుల నుంచి పల్సర్‌బైక్ సుజుకీస్కూటీ, హోండా ఎక్టివా, నాలుగు మొబైల్‌ఫోన్లు, క్రికెట్ బ్యాట్, రూ.1400 నగదును స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన నిందితులను కోర్టుకు తరలించామని, మిగిలిన ఇద్దరిని కూడా త్వరలో పట్టుకుంటామని ఎస్ఐ రామకృష్ణ పేర్కొన్నారు.

అమ్మ, నాన్న ఉండి.. అనాథలే!

- పట్టించుకోని తల్లి
- వదిలివెళ్లిపోయిన తండ్రి
- దీన స్థితిలో చిన్నారులు



చిన్నారులు తేజ కిరణ్, భానుప్రకాష్

రాజానగరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తల్లి వివాహేతర సంబంధం కారణంగా పట్టించుకోకపోవడం, ఆపై తండ్రి కూడా వదిలివెళ్లిపోవడంతో అందరూ ఉన్న అనాథలుగా కాలం వెళ్లదీస్తున్న చిన్నారుల హృదయ వేదన ఇది. వివరాల్లోకి వెళితే... తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొంత మూరులోని చెంచుల కాలనీలో నివాసముంటున్న అన్నెపు ధనలక్ష్మి, జయరామ్ దంపతులకు తేజ కిరణ్(10), భానుప్రకాష్ (8) పిల్లలు ఉన్నారు. వారు రాజమహేంద్రవరంలోని నారాయణ స్కూల్లో 4,2 తరగతులు చదువుతున్నారు. తండ్రి జయరామ్ పెయింటింగ్ వర్కు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య ధనలక్ష్మి కర్రీ పాయింట్‌లో కేటరింగ్ పనులు చేస్తుండేది. ఈ క్రమంలో మందపల్లి ప్రవీణ్ కుమార్‌తో ఆమెకు పరిచయం ఏర్పడి అది వివాహేతర బంధానికి దారితీసింది. ప్రియుడి మోజులో పడిన ధనలక్ష్మి ఇద్దరు పిల్లలను, భర్తను పట్టించుకోవడంలేదు. కూతురి ప్రవర్తన తీరును మందలించాల్సిన తల్లి తులసమ్మ.. అల్లుడు జయరామ్ బయటకు వెళ్లిపోయేలా చేసింది. ఏడాదిగా తల్లి వద్దనే ఉంటున్న చిన్నారులిద్దరితో ప్రియుడికి అవసరమైన సేవలు చేయించేది. తల్లి చెప్పిన పనులు చేయకపోతే ప్రియుడు ప్రవీణ్‌కుమార్ చిన్నారులను బెల్టు, వైర్లతో శరీరంపై తట్టులు వచ్చేలా కొడుతూ చిత్రహింసలకు గురిచేసేవాడు. దీంతో విషయం తెలుసుకున్న చిన్నారుల మేనమామ పాలవలస బాలమణికంఠ రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేసి రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రిలో చిన్నారులకు చికిత్స చేయించి, తన ఇంటికి తీసుకెళ్లాడు. 3 నెలలుగా మేనమామ సంరక్షణలో ఉంటున్న చిన్నారులిద్దరూ తమను నాన్న వద్దకు చేర్పించాలంటూ దీనంగా మేనమామను వేడుకుంటున్నారు. దీంతో మేనమామ బాలమణికంఠ చిన్నారులను వెంటబెట్టుకుని 3నెలలుగా రాజానగరం పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కడం దిగడం చేస్తున్నాడు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ నారాయణమ్మను శుక్రవారం ఫోన్‌లో సంప్రదించగా చిన్నారుల తండ్రి శ్రీకాకుళంలో ఉంటున్నాడు. ఒకటి, 2రోజుల్లో వస్తానన్నాడు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, తల్లిదండ్రుల సమక్షంలో చిన్నారులు ఎవరి వద్ద ఉంటామంటారో విన్న తర్వాత నిర్ణయం తీసుకుంటామని ఆమె బదులిచ్చారు.

కేశనకుర్రు టూ వైట్‌హౌస్

సీఐఎస్ఏ డిప్యూటీ డైరెక్టర్‌గా కోనసీమ వాసి



ఐ.పోలవరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అమెరికా సైబర్ సెక్యూరిటీ, మౌలిక సదుపాయాల భద్రతా సంస్థ (సీఐఎస్ఏ) డిప్యూటీ డైరెక్టర్‌గా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేశనకుర్రుకు చెందిన డాక్టర్ గొట్టుముక్కల మధు నియమితులయ్యారు. గొట్టుముక్కల వెంకటసూర్యనారాయణ రాజు(కొండరాజు), సత్యవాణి దంపతుల కుమారుడు మధుకు ఈ అరుదైన గౌరవం లభించడంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అగ్రరాజ్యంలో మధు కీలక పదవిని సాధించడంపై తల్లిదండ్రులు, స్నేహితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

గోకవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గోకవరం గ్రామ శివారున నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై శుక్రవారం దాడి చేసినట్టు ఎస్ఐ వీఎన్‌వీ పవన్‌కుమార్ తెలిపారు. ఈదాడిలో నిర్వాహకురాలితో పాటు ఇద్దరు మహిళలను, ముగ్గురు విటులను అరెస్ట్ చేసినట్టు చెప్పారు. పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపర్చనున్నామని తెలిపారు.

రామాలయంలో ఉత్సవ విగ్రహాల చోరీ

ఉప్పాడ నాయకర్ కాలనీ-1లో ఆలస్యంగా వెలుగులోకి ఘటన



ఆలయంలో చోరీకి గురవకుండా ఉన్న తోరణం

కొత్తపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం ఉప్పాడ నాయకర్ కాలనీ-1లో శ్రీసీతారామస్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఉత్సవ విగ్రహాలు అపహరించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆలయంలో నిత్యం పూజలు చేసే మల్లే మంగ తెలిపిన వివరాల ప్రకారం. నాయకర్ కాలనీలో పురాతన శ్రీసీతారామస్వామి ఆలయాన్ని పునఃనిర్మించి ఏప్రిల్ 15న విగ్రహాల ప్రతిష్ఠ చేశారు. కాలనీలో ప్రతీరోజూ ఆలయంలో పూజలు చేస్తారు. నాలుగురోజుల కిందట ఆలయంలో పూజలు చేసుచేసేందుకు స్థానికుడు ఒకరు ఆలయం తాళం అడిగారు. పూజల అనంతరం ఆలయానికి వేసిన తాళాన్ని దగ్గర్లో ఉన్న బడ్డీకొట్టులో ఇచ్చి వెళ్లారు. శుక్రవారం ఉదయం ఆలయంలో స్థానిక సమస్యలపై పెద్దలు చర్చిస్తుండగా ఆలయంలో ఉత్సవ విగ్రహాలు లేకపోవడాన్ని గుర్తించారు. వెంటనే ఆలయం తలుపులు తీసి పరిశీలించేసరికి తోరణం, హనుమాన్ విగ్రహం తప్ప మిగిలిన ఉత్సవ విగ్రహాలను అపహరించడాన్ని గుర్తించారు. ఆలయం లో చోరీకి గురైన కంచు ఉత్సవ విగ్రహాల విషయంపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. చోరీకి గురైన ఉత్సవ విగ్రహాలు సుమారు రూ.50వేలపైగానే ఉంటాయని స్థానిక మత్స్యకారు పెద్దలు చెబుతున్నారు.



చోరీకి గురైన ఉత్సవ విగ్రహాలు (ఫైల్‌ఫొటో)

సత్యదేవుని హుండీల ఆదాయం

రూ.1.26 కోట్లు

అన్నవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని సన్నిధిలో భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించగా రూ.1,26,07,501 నగదు, 50.100 గ్రాముల బంగారం, 950 గ్రాముల వెండి సమకూరాయి. వీటితోపాటుగా యూఎస్ఏకు చెందిన 215 డాలర్లు, యూరోలు 140, థాయిలాండ్‌కు చెందిన 140 బాట్‌లతో పాటుగా పలుదేశాల కరెన్సీ లభించాయి. ఈ లెక్కింపును సిబ్బంది చేపట్టగా ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ పర్యవేక్షించారు. 28 రోజులకు ఈ ఆదాయం సమకూరగా సరాసరిన భక్తులు రోజుకు రూ.4.50 లక్షలు కానుకల రూపంలో సమర్పించారు.



హుండీల లెక్కింపును పర్యవేక్షిస్తున్న దేవస్థానం చైర్మన్, ఈవో

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

న్యాయం చేయాలని మృతదేహంతో ఆందోళన



మండపేటలో సత్తిబాబు మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబసభ్యులు

మండపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పని ముగించుకుని ఓ వ్యక్తి ఇంటికి వెళ్తున్న సమయంలో బైక్ వేగంగా ఢీకొనడంతో మృతిచెందాడు. వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట గొల్ల పుంత కాలనీకిచెందిన మాదాబత్తుల సత్తిబాబు స్థానికంగా వెండి పట్టీల తయారీ దుకాణంలో పని చేస్తుంటాడు. గురువారం రాత్రి పని ముగించుకుని ఇంటికి వెళ్తుండగా ఓ బైక్ వేగంగా వచ్చి ఢీకొంది. తీవ్ర గాయాలపాలైన సత్తిబాబును మండపేట ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సత్తిబాబు శుక్రవారం మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. అతడికి భార్య, పిల్లలు వున్నారు. కుటుంసభ్యులు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ పోలీసులు తెలిపారు. ఈ సంఘటనలో మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తు సహచర కార్మికులు, బంగారు దుకాణ వ్యాపారులు సత్తిబాబు మృతదేహంతో శుక్రవారం సాయంత్రం పట్టణంలోని కలువపువ్వు సెంటర్‌లో ఆందోళనకు దిగారు. మానవహారం చేపట్టారు. పట్టణ సీఐ దారం సురేష్ అక్కడకు చేరుకుని ఆందోళ కారులతో మాట్లాడి మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, ప్రమాదానికి కారకుడైన వ్యక్తి గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని కోలుకున్న వెంటనే ఆదుపులోకి తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

రైలు ఢీ కొని వ్యక్తి మృతి



మరణించిన వ్యక్తి

తుని రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీ కొని వ్యక్తి మృతిచెందిన ఘటన కాకినాడ జిల్లా తుని రైల్వే స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. హంసవరం నుంచి అన్నవరం మధ్యలో రైలు పట్టాలు దాటుతుండగా ఓ రైలు ఢీ కొని వ్యక్తి మృతి చెందినట్టు సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అయితే మృతుడికి సంబంధించిన వివరాలు కానరాకపోవడంతో మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేశారు. మృతుడి సంబంధికులు ఎవరైనా ఉంటే తుని రైల్వే పోలీస్‌స్టేషన్లో సంప్రదించాలని కోరారు. మృతదేహం వద్ద నీలి రంగు బ్యాగ్ లభించిందని, తెలుపు చొక్క, ఫుల్ ప్యాంట్ దుస్తులు ధరించి ఉన్నట్టు ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో అన్నవరం దేవస్థానం ఉద్యోగి మృతి



తలుపులయ్య (ఫైల్)

అన్నవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పెద్దింటి తలుపులయ్య (58) గురువారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ప్రస్తుతం ప్రోటోకాల్ బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయనకు డయాబెటీస్ ఉండడంతో కొంతకాలంగా నీరసంగా ఉంటున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తలుపులయ్య మృతి పట్ల దేవస్థానం ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గంటా విష్ణు, బలువు సత్యశ్రీనివాస్ సంతాపం తెలిపి నివాళులర్పించారు.

కోడిపందాలడుతున్న 26 మంది అరెస్టు

రూ.96,700 నగదు, 25 సెల్‌ఫోన్లు, 20 బైక్‌లు, 3 కారులు, 3 కోళ్లు స్వాధీనం



కోరుకొండ మండలం మధురపూడిలో పట్టుబడ్డ 26 మందితో పోలీసులు

కోరుకొండ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ పోలీసులు కోడిపందాల శిబిరంపై మెరుపు దాడి చేశారు. తూర్పుగోదావరి జిల్లా స్పెషల్ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు కోరుకొండ మండలం మధురపూడి గ్రామ శివారులో కోడిపందాలడుతున్న వారిపై గురువారం అర్ధరాత్రి కోరుకొండ సీఐ వై.సత్యకిషోర్ పర్యవేక్షణలో ఎస్ఐ టి.శ్యామ్‌సుందర్, సిబ్బందితో దాడి చేశారు. 26 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.96,700 నగదు, 25 సెల్‌ఫోన్లు, 20 బైక్‌లు, 3 కారులు, 3 కోళ్ల స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉగ్రవాదుల దాడి అత్యంత కిరాతకం

సచ్చిదానంత సరస్వతి మహాస్వామిజీ



మీడియాతో మాట్లాడుతున్న స్వామిజీ

తుని రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పహల్గాంలో ఉగ్రవాదుల దాడి అత్యంత కిరాతకమని తపోవన ఆశ్రమం పీఠాధిపతి సచ్చిదానంత సరస్వతి మహాస్వామిజీ అన్నారు. కాకినాడ జిల్లా తుని మండలంలో గల ఆశ్రమంలో శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి ఉగ్రదాడి దాడిని తీవ్రంగా ఖండించారు. ప్రకృతి అందాలను చూసేందుకు వచ్చిన పర్యాటకులపై కాల్పులు జరిపి హతమార్చడం హేయమైన చర్యగా అభివర్ణించారు. హిందువులని తెలుసుకుని చంపడం ఘోరాతి ఘోరమైన అంశమన్నారు. ఇటువంటి చర్యలను అందరూ ఖండించాలని కోరారు. ఉగ్రవాదం భావజాలంతో ఉన్న వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమాజంలో శాంతి, సామరస్యమే ఉన్నతమైన వాతావరణాన్ని తీసుకువస్తుందని కానీ ఇలాంటి హింసాత్మక సంఘటనలు ఎటువంటి ప్రభావాన్ని చూపించవని అన్నారు. కేవలం మత పరమైన భావజాలంతో ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడడం దారుణమైన విషయమని స్వామిజీ చెప్పారు. భారతదేశం మతాలు, వర్గాలకతీతంగా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఉగ్రవాదం అందరికీ ఉమ్మడి శత్రువు అని కేంద్ర నాయకత్వానికి భారతీయుల సంపూర్ణ మద్దతు తెలపాలన్నారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నాదానికి వ్యతిరేకంగా గళంవిప్పేందుకు భారతీయులు ఏకతాటిపైకి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

కాలువలో గుర్తుతెలియని మృతదేహం



మాచవరం ప్రధాన కాలువలో మృతదేహం

రాయవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట-మాచవరం ప్రధాన కాలువలో మొయిన్‌రోడ్డు ఆనుకుని ఉన్న పెట్రోల్ బంక్ సమీపంలో శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. నిక్కర్, బనియన్‌తో సుమారు 50 ఏళ్ల కలిగిన పురుషుడి మృతదేహం కాలువలో బాగా ఉబ్బి ఉండటంతో గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. ఈ విషయాన్ని స్థానికులు 100 సమాచారం తెలియజేయడంతో రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

ఏలేరు కాలువలో...



రౌతులపూడి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడి గ్రామ శివారు బంగారయ్యపేట వంతెన వద్ద ఏలేరు కాలువలో 60ఏళ్ల వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చిందని ఎస్ఐ జి. వెంకటేశ్వరరావు తెలిపారు. తెలుపు రంగు మీద నలుపు చారలు హాఫ్ హ్యాండ్స్ గళ్ల చొక్కా వైట్ బనియన్ వేసుకుని ఉన్నాడని, ఎత్తు 5.5 అడుగులు ఎత్తు, తెలుపు రంగు జుట్టు, తెలుపు గెడ్డం ఉందన్నారు. ఆచూకీ తెలిసిన వారు రౌతులపూడి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

చెరువులో మోటారుసైకిల్ పడి వ్యక్తి మృతి

అల్లవరం ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సామంతకుర్రు పల్లిపాలేనికి చెందిన పెసింగి కామరాజు(65) మోటారుసైకిల్‌పై వెళ్తూ రోడ్డుపక్కన చెరువులో పడి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. భార్య అన్నపూర్ణను ఉపాధి పనుల నుంచి తీసుకువచ్చేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ చెరువులో పడిపోయాడు. చెరువులో అతడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్య అన్నపూర్ణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అల్లవరం ఎస్ఐ టి.తిరుమలరావు తెలిపారు.

పంటకాలువలో జారి పడి వ్యక్తి గల్లంతు?

అమలాపురం రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నడిపూడి లాకుల వద్ద ప్రధాన పంటకాలువలో శుక్రవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి జారిపడి గల్లంతైనట్టు సమాచారం అందుకున్న అమలాపురం తలూకా పోలీసులు హుటాహుటీన అగ్నిమాపక సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రాత్రి 9 గంటల వరకు గాలింపు చర్యలు చేపట్టినా గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభ్యం కాలేదని తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. శ్రీరామ్‌నగర్‌కు చెందిన సరెళ్ల సురేష్‌కుమార్ ముంగండ గ్రామంలో జరిగిన వేడుకకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ సంఘటన జరిగిందని స్థానికులు చెబుతున్నారు. అంతకు ముందు మధ్యాహ్న సమయంలో అపస్మారక స్థితిలో ఉన్న సురేష్‌కుమార్‌ను స్థానికులు గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు వెళ్లారు. తిరిగి వచ్చేసరికి సురేష్‌కుమార్ లేకపోవడంతో ప్రధాన పంటకాల్వలో జారి పడి గల్లంతైనట్టు భావిస్తున్నారు. గజ ఈతగాళ్లతోను గాలింపు చర్యలు చేపట్టారు. అయితే సురేష్‌కుమార్ గల్లంతయ్యాడా లేక ఎటువైపైనా వెళ్లిపోయాడా అన్న కోణంలోను పోలీసులు దర్యాప్తుచేస్తున్నారు.



మంచు.. మైమరపించు

శుక్రవారం సూర్యోదయం వేళ తూర్పుగోదావరి జిల్లా తీపర్రు వద్ద గోదావరి లంక ప్రాంతాల్లో మంచు దృశ్యాలను ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించిందిలా.. పెరవలి(ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఇంటింటికీ గోదావరి జలాలు అందిస్తాం

ఎమ్మెల్యే గోరంట్ల.. బొమ్మూరు, హుకుంపేటలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): గోదావరి చెంతనే ఉన్నా కొన్ని ప్రాంతాల్లో తాగునీటి కొరత వుందని జలజీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికి గోదావరి నీరు అందించే విధంగా కార్యాచరణ చేస్తున్నామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌరి అన్నారు. మండలంలోని బొమ్మూరు, హుక్కుంపేట గ్రామాల్లో రూ.6.41కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. దీనిలో భాగంగా హుకుంపేట పంచాయతీ శాంతిపురం, చైతన్యనగర్, నాగిరెడ్డి నగర్‌లో రామకృష్ణనగర్, డి బ్లాక్, బొమ్మూరు మురళీకొండ, వెంకటగిరి నాయుడుపేట ప్రాంతాల్లో నిర్మించిన సీసీ రోడ్లు, వరలక్ష్మినగర్, జేఎల్‌బీ నగర్‌లలో వాటర్ ట్యాంకులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా పెండింగ్‌లో వున్న అనేక పనులను తమ ప్రభుత్వం పూర్తిచేసిందన్నారు. డి బ్లాక్, ఒడియాపేట, టవర్ లైన్ కింద ఉన్న వారికి రాబోయే రోజుల్లో డి బ్లాక్‌లోనే టిడ్కో ఇళ్లు నిర్మించి వారికి కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో వాసిరెడ్డి రాంబాబు, మత్యేటి ప్రసాద్, మార్ని వాసుదేవరావు, దుద్దుపూడి రమేష్, బొప్పన నానాజీ, పెండ్యాల రామకృష్ణ, కురుకూరి కిషోర్,ఎంపీడీవో శ్రీనివాసరావు, కార్యదర్శి కాశీ విశ్వనాథ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు

ఎమ్మెల్సీ సోము వీర్రాజు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలతో బాటు నాణ్యమైన మధ్యాహ్నభోజనం విద్యార్థులకు అందించేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వ్యయపరుస్తోందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. రాజానగరం మండలం కొండగుంటూరులోని ప్రాథమిక పాఠశాలలో ప్రోలీఫిక్స్ సంస్థ సీఎస్ఆర్ కింద సమకూర్చిన రూ.12 లక్షలతో నిర్మించిన ప్రహరీగోడను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం ఎన్నో సదుపాయాలు కల్పిస్తున్నప్పటికీ పిల్లలు చేరడం లేదని, ఈ పద్ధతి ఇలాగే కొనసాగితే గ్రామాల్లో ప్రభుత్వ బడులు మూతపడే ప్రమాదముందని ఆవేదన చెందారు. తల్లిదండ్రులు తమ ఆలోచనా దృక్పథం మార్చుకుని తమ పిల్లలను ప్రభుత్వపాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, నీరుకొండ వీరన్నచౌదరి, ఆళ్ల శివనాగరాజు, ఎంపీడీవో జేఏ ఝాన్సీ, అడబాల గణపతి, మోది సత్తిబాబు, అరిగెల రామకృష్ణ పాల్గొన్నారు.

హైకోర్టు రిటైర్డ్ జడ్జి బాలయోగికి సత్కారం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): హైకోర్టు రిటైర్డ్ జడ్జి నక్కా బాలయోగిని ఎస్సీఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోరుకొండ చిరంజీవి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. గురువారం రాజమహేంద్రవరం వచ్చిన న్యాయమూర్తి బాలయోగిని స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఎస్సీఎస్టీ ఉద్యోగుల సంఘం నాయకులు తాళ్లూరి బాబూ రాజేంద్రప్రసాద్, పోలేపల్లి నాగేశ్వరరావు, జంగం సుబ్బారావు, టీఎస్ ప్రభాకర్, ఎస్.తిరుమల ఉదయ్,దారా యేసు రత్నం, ఎండీ ఆశాలత తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బాలయోగి మాట్లాడు తూ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారా బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడ్డారని, ఆయన కల్పించిన రిజర్వేషన్లతో ఉన్నతస్థాయికి చేరిన ఎస్సీఎస్టీ ఉద్యోగులు సాటి వారి ఉన్నతికి సహకరించాలని సూచించారు.

దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలి

ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో పెండింగ్‌లో ఉన్న దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సానా కృష్ణయ్య, ఎంవీ గోపాలరావు డిమాండ్ చేశారు. ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం బొమ్మూరులోని 220కేజీ సబ్‌స్టేషన్ వద్ద ప్లాటినం జూబ్లీ వేడుకలు ఓఅండ్ఎం ఏపీ ట్రాన్స్‌కో రాజమండ్రి ప్రాంతీయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు వారు ముఖ్యఅతిథులుగా విచ్చేసి యూనియన్ చిహ్నం టవర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే చెల్లించాలని, 24గంటల పాటు విధి నిర్వహణలో ఉండే ఉద్యోగులకు నగదు రహిత మెడికల్ పాలసీ అమలు చేయాలని, కాంట్రాక్టు కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి డైరెక్టుగా జీతాలు ఇవ్వాలని, గత ప్రభుత్వంలో నియమించిన 7200మంది ఎనర్జీ అసిస్టెంట్స్ ను ఎలక్ట్రిసిటీ బోర్డు జేఎల్ఎంలుగా విలీనం చేయాలనే తమ డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు జగదీశ్వర్, కె.శ్రీనివాసులు, ఎండీ అబ్దుల్‌గఫూర్, ఎం.శ్రీనివాసరావు, ఎం.వీరాంజనేయులు, జీవీ శేఖర్, ఎల్.నాగేశ్వరావు, వి.శ్రీనివాస్, వీవీఎస్‌యూ నాగేశ్వరరావు, ఎ.గురుబాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

సీతానగరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): సీతానగరంలోని వెలమపేటలో అగ్నిప్రమాదం సంభవించి తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన కోడూరి సన్యాసిరావుకు చెందిన తాటాకింటిలో శుక్రవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగి నిప్పంటుకుని ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఇల్లు కాలిపోయిన సీతానగరం ఏఈకి ఫోన్ చేసి వివరాలు అడుగగా తనకు తెలియదని పరిశీలిస్తానని చెప్పడంతో ఆగ్రహానికి గురయ్యారు. దీంతో విద్యుత్ శాఖ ఎస్ఈకి ఫోన్ చేసి ఇల్లుకాలిన విషయం నియోజకవర్గం మొత్తం తెలిసినా ఏఈకి తెలియకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసి అతడిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రభుత్వం ద్వారా బియ్యం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి, మద్దాల కొండలరావు, అంబటి వెంకటరమణ, మట్ట వెంకటేశ్వరరావు తదిరులు పాల్గొన్నారు.

లేబోరేటరీ ఎదుటే గర్భిణీ ప్రసవం ?

రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధన ఆసుపత్రిలో ఘటన

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రక్తపరీక్షలు నిర్వహించే లేబరేటరీ ఎదుట గర్భిణికి నొప్పులు రావడం, ఆమెకు అక్కడే డెలివరీ జరిగిన ఘటన శుక్రవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రిలో జరిగింది. అయితే, ఈ డెలివరీకి వచ్చిన ఆ మహిళ ఎవరు, ఎక్కడి నుంచి వచ్చారు అనే వివరాలను ఆసుపత్రి అధికారులు గోప్యంగా ఉంచారు. కాగా, డెలివరీ కోసం ఆసుపత్రికి వచ్చిన గర్భిణి రక్తపరీక్షల కోసం ఎంసీహెచ్ బ్లాకులో ఉన్న ల్యాబ్‌కు వెళ్లగా అక్కడున్న సిబ్బంది ఆ పరీక్ష తమ వద్దలేదని చెప్పడంతో మెయిన్‌బ్లాకులో ఉన్న పెద్దల్యాబ్‌కు వెళ్లింది. అక్కడే ఆమెకు నొప్పులు రావడం, అక్కడికి సమీపంలో ఉన్న నర్సింగ్‌స్టాఫ్‌కు తెలియడంతో వారి పర్యవేక్షణలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రసవం చేసినట్టు తెలిసింది. ఈ వార్త ప్రభుత్వ బోధనాసుపత్రి ఉద్యోగుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

దోమల నివారణతో మలేరియా అంతం

ప్రపంచ మలేరియా నివారణ దినం పలుచోట్ల అవగాహన ర్యాలీలు

కడియం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతలను పాటిస్తే దోమలను నివారించవచ్చని సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని తెలిపారు. ప్రపంచ మలేరియా నివారణ దినం సందర్భంగా శుక్రవారం కడియంలో పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ఎం.మణిజ్యోత్స్న మాట్లాడుతూ దోమలను నివారిస్తే మలేరియా అంతమవుతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రామకృష్ణ, మురళీ, మూర్తి, సత్యనారాయణ, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

గోకవరం: మండలంలోని కొత్తపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ర్యాలీ చేపట్టారు. డ్రైడే ఆవశ్యకత వివరించారు. నీటి నిల్వలు దోమల ఆవాసాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరి చేరవని చెప్పారు. ర్యాలీ అనంతరం మలేరియా నిర్మూలనకు ప్రతిజ్ఞ చేశారు.

సన్నిధానం పక్షపత్రిక వార్షిక సంచిక ఆవిష్కరణ

రాజమహేంద్రవరం కల్చరల్ ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం నగరం, ఆధ్యాత్మిక, సాంస్కృతిక పుణ్యక్షేత్రమని కంచి విశ్వవిద్యాలయం ఉపకులపతి గుళ్ళపల్లి శ్రీనివాసు కీర్తించారు. శుక్రవారం ఉదయం స్థానిక కోటిపల్లి బస్టాండ్ వద్ద ఫ్రీడం ఫైటర్స్ పార్కులో ఆధ్యాత్మిక పక్ష పత్రిక సన్నిధానం వార్షిక సంచిక ఆవిష్కరించారు. మాదిరాజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, సంస్కృతి, సాంప్రదాయాలకు, పండితులకు, కవులకు, రచయితలకు రాజమహేంద్రవరం పుట్టినిల్లని అన్నారు. సన్నిధానం శాస్త్రి, వైస్ చాన్సలర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో సీపీ రెడ్డి, దూర్వాసుల సత్యనారాయణ, దేశిరెడ్డి బలరామనాయుడు, పుట్రేవు ఉపేంద్ర, పులగుర్త సాయిబాబా, నగేష్ పాల్గొన్నారు.

'నా ఉద్యోగం నాకు ఇప్పించండి'

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): నేను ఏ తప్పు చేయకపోయినా నన్ను ఉద్యోగం నుంచి తొలగించారని అంగన్వాడీ టీచర్ నడిపల్లి గంగాభవాని ఆవేదన వ్యక్తం చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు.గతంలో తాను అనపర్తి మండలం కోమరిపాలెంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేశానని, ఆపై బొమ్మూరు మురళీకొండ పైన కేంద్రానికి బదిలీ అయ్యిందన్నారు. ఇటీవల తనపై ఇర్రెగ్యూలర్ అని కొందరు తప్పుడు ప్రచారం చేసి ఉద్యోగం నుంచి తప్పించారన్నారు. బతకడానికి ఎటువంటి ఆధారం లేదని, తన ఉద్యోగం తనకు ఇప్పించి న్యాయం చేయాలని కన్నీరుపెట్టుకుంది.

కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల

మారణకాండకు ఖండన



కంబాలచెరువు వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన శాంతి ర్యాలీ

- ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ
- పలుచోట్ల నిరసన కార్యక్రమాలు
- ర్యాలీలు, మానవహారాలు



నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

సీతానగరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) భారతదేశం అభివృద్ధి పథంలో దూసుపోతుంటే ఓర్వలేని పాకిస్తాన్ ఉగ్రవాదులు దేశంలో అల్లర్లు సృష్టించారని, పెహల్గాంలో జరిగిన మారణ కాండను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. శుక్రవారం సీతానగరం పాత బస్టాండ్ సెంటర్‌లో కూటమి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన నల్ల బ్యాడ్జిలు ధరించి మానవహారం ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో తొలగించడానికి కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఉగ్రదాడిలో మరణించిన వారికి నివాళులర్పించి వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో పెందుర్తి అచ్యుత రామారావు, గెడ్డం తిమ్మారావు, పోలిన కృష్ణ, దూలం కృష్ణ, బీజేపీ మండలాధ్యక్షురాలు రాపాక వెంకటలక్ష్మి, మద్దాల కొండలరావు, అంబటి వెంకటరమణ సీపీఐ ఎంఎల్ నాయకుడు పలివెల వీరబాబు, మట్టా వెంకటేశ్వరరావు. జనసేన వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: పహల్గామ్ వద్ద పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ, దాడిలో మరణించిన వారి ఆత్మలకు శాంతి కలగాలని రంగంపేట డీసీసీ బ్యాంక్ మేనేజర్ షేక్ బషీర్, సొసైటీ సీఈవో బొడ్డు త్రిమూర్తులు, సూపర్‌వైజరు, బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు.

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు గ్రా మంలో గురువారం రాత్రి హిందూ ధర్మ ప్రచార సమితి సభ్యు లు గ్రామస్థులతో కలసి కొవ్వొత్తులు, కాగడాలతో ర్యాలీ జరిపారు. మానవహారంగా ఏర్పడి పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేసి, హత్యకు గురైన పర్యాటకుల ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. ప్రధాని మోదీ పాకిస్తాన్‌కు తగిన రీతిలో బుద్ధి చెబుతారన్నా రు. అలాగే శుక్రవారం రాత్రి బిక్కవోలులో కూటమి నాయకులు స్థానిక వంతెన వద్ద నుంచి మెయిన్‌రోడ్ మీదుగా ర్యాలీ జరిపి పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హత్యకు గురైన పర్యాటకులకు ఆత్మశాంతి కలగాలని ప్రార్థించారు. కార్యక్రమంలో రావాడ నాగు, పల్లి శ్రీని వాసరెడ్డి, బేరా వేణమ్మ, చాగంటి సాయిబాబారెడ్డి, నూతంగి శ్రీను, ఎస్ఐ వి.రవిచంద్రకుమార్, ఆశాలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన పాశవిక ఉగ్రదాడిని నిరసిస్తూ రాజమండ్రిలో జర్నలిస్టులు కదం తొక్కారు.ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక గణేష్‌చౌక్ వద్ద ప్రెస్‌క్లబ్ భవనం నుంచి జాంపేట గాంధీబొమ్మ వరకు ర్యాలీ జరిపారు. ఉగ్రవాదం నశించాలి, టెర్రరిస్టులను తుద ముట్టించాలి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ ఉగ్రవాదల దాడి అత్యంత హే యమైన పాశవిక చర్య అని, టెర్రరిస్టులను తీవ్రంగా శిక్షించాలన్నారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజమహేం ద్రవరంలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రాజమహేంద్రవరంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న జర్నలిస్టులు

రాజమహేంద్రవరం అర్బన్: జిల్లా బ్యాంకు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పుష్కరఘాట్ వద్ద, యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కంబాలచెరువు వద్ద నిరసన ప్రదర్శనలు జరిగాయి. కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ, మానవహారం చేపట్టారు. పుష్కరఘాట్ వద్ద బ్యాంకు ఉద్యోగులు చేపట్టిన నిరసన ప్రదర్శనలో సంఘం జిల్లా కన్వీనర్ ఎస్.లక్ష్మీపతిరావు మాట్లాడుతూ ఉగ్రవాదులు 26 మంది పర్యాటకులను అతికిరాతంగా హతమార్చడం అమానుషమని అన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఉగ్రవాదులు ఎక్కడున్నా పట్టుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. బ్యాంకు ఉద్యోగులు సోమరాజు, మురళీధర్, రమేష్, అప్పారావు, ఉమారాణి, సూర్య, రాంబాబు, కిషోర్, వెంకటేశ్వరరావు, శివరామకృష్ణ, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. కంబాలచెరువు వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అసోసియేట్ ఎం.విజయగౌరీ, జిల్లా కార్యదర్శులు శ్రీమణి, రమేష్‌బాబు, చిలుకూరి శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసు, దయానిధి, రూపస్‌రావు తదితరులు మాట్లాడుతూ పర్యాటకులను చంపడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన జవాన్లకు, మృతిచెందిన పర్యాటకులకు జనసేన పార్టీ మూడు రోజులపాటు సంతాప దినాలు పాటిస్తోందని సిటీ ఇన్‌ఛార్జి అనుశ్రీ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక ఏవీ అప్పారావు రోడ్డులోని రామాలయం సెంటర్లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో జనసేన జిల్లా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే ఉగ్రవాదుల కాల్పుల్లో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు సీపీఐ ఎంఎల్ న్యూ డెమాక్రసీ కేంద్ర కమిటీ సంతాపం, సానుభూతి తెలిపింది. ఈ మేరకు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి చంద్రన్న ఒక ప్రకటన విడుదల చేస్తూ ఈ ఘటనను సాకుగా తీసుకుని భారత్, పాక్ ప్రభుత్వాలు చేస్తున్న యుద్ధ సన్నాహాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, సమస్యలను శాంతియుత పద్ధతిలో చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

ఉగ్రవాదుల దాడిని రాజకీయం చేయడం దుర్మార్గం

- బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిర్మల కిషోర్

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జమ్ము కశ్మీర్ పెహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని కాంగ్రెస్ పార్టీ రాజకీయం చేయాలనుకోవడం హేయమైన చర్య అని, ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిళారెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు బొల్లిన నిర్మల కిషోర్ డిమాండ్ చేశారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ వైఎస్ షర్మిళ ముందు తన కుటుంబంలోని సమస్యలను పరిష్కరించుకుని అప్పుడు దేశం గురించి మాట్లాడితే మంచిదని అన్నారు. ప్రధానిపై మళ్లీ అనుచిత వ్యాఖ్యలు చేస్తే షర్మిళారెడ్డికి రాష్ట్రంలోని మహిళామోర్చా మహిళలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి ప్రసన్న, జిల్లా అధ్యక్షురాలు మద్దిపాటి రజని తదితరులు పాల్గొన్నారు.

101 కెనాల్స్‌తో కుక్కల నియంత్రణకు చర్యలు

- రాజమహేంద్రవరం ఏబీసీ సెంటర్ తనిఖీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు



ఏబీసీ సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో వీధి కుక్కల బెడద లేకుండా చేసేందుకు 101 కెనాల్స్ ద్వారా కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టారని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తెలిపారు. శుక్రవారం స్థానిక క్వారీ సెంటర్ సమీపంలోని ఏబీసీ సెంటర్‌ను ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్నతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏబీసీ సెంటర్‌లో అన్ని మౌలిక సదుపాయాలు, వైద్య సిబ్బంది ఉన్నట్టు తెలిపారు. రెండు ఆపరేషన్ థియేటర్ల ద్వారా రోజుకు 50 వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. నగరంలో 20వేల కుక్కలున్నాయని వాటికి ర్యాబిస్ వాక్సినేషన్ చేస్తున్నారని వేసవి కాలంలో ప్రజలపై వీధి కుక్కల దాడి తీవ్రతను గుర్తించి జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగరంలో కుక్కల బెడద అధికంగా ఉన్న ప్రాంతాలను గురించి తమకు తెలియజేస్తే తక్షణం నివారణ చర్యలు చేపడతామన్నారు.

నగరంలో కొత్తగా 500 పింఛన్లు

నగరంలో కొత్తగా 500 పింఛన్లు మంజూరు చేశారని ఎమ్మెల్యే వాసు అన్నారు. ఇంటి పెద్ద చనిపోతే వెంటనే భార్యకు కొత్త పెన్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఒక్క రాజమహేంద్రవరంలో 303 కొత్త పింఛన్లు పింఛన్లు మంజూరయ్యాయని, వీటిని బహుశ మే నెల నుంచి ఇచ్చే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, మొకమాటి సత్యనారాయణ, రాచపల్లి ప్రసాద్, కవులూరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు గొడుగులు పంపిణీ

స్థానిక వీఎల్ పురంలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద చిరు వ్యాపారులకు స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు సమకూర్చిన గొడుగులను ఎమ్మెల్యే వాసు పంపిణీ చేశారు. నగరంలో చిరువ్యాపారులెవరికైనా గొడుగులు కావాలంటే వారి ఆధార్ కార్డుతో లాలాచెరువులోని స్వర్ణాంధ్ర సంస్థను సంప్రదించవచ్చని రాంబాబు చెప్పారు. టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి బుడ్డిగ రాధా ప్రోద్బలంతో జరిగిన ఈ కార్యక్రమంలో చాపల చిన్నరాజు, అజ్జరపు రమేష్, దాస్యం ప్రసాద్, సూర్యనాయుడు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవర ఆనంద్ నగర్‌కు చెందిన జి.సంజీవ్ అనే 25 ఏళ్ల యువకుడు ఈనెల 20వ తేదీ నుంచి కనిపించడం లేదని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. సంజీవ్ స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఇంటి నుంచి వెళ్లిన అతను తిరిగిరాకపోవడం, చట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో తల్లి సునీత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రిటైర్డ్ రైల్వే ఉద్యోగి నుంచి

రూ.40 వేలు కొట్టేశారు..

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కంబాలచెరువు ప్రాంతానికి చెందిన రిటైర్డ్ రైల్వే ఉద్యోగి ఏ వీరభద్రరావు నుంచి దుండుగులు రూ.40 వేలు అపహరించుకుపోయారని టూటౌన్ పోలీసులు తెలిపారు. శనివారం ఉదయం కంబాలచెరువు నుంచి ఆటోలో రైల్వేస్టేషన్‌కు వీరభద్రరావు బయలుదేరారు. స్టేషన్ వద్ద ఆటో దిగే సరికి అతని వద్ద ఉన్న రూ.40 వేలు కనిపించలేదు. తనతో పాటు ప్రయాణం చేసిన వారే ఆ నగదు అపహరించుకుపోయారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళా సాధికారత కూటమితోనే సాధ్యం

ఎమ్మెల్యే నల్లమిల్లి.. అనపర్తిలో ఉచిత కుట్టు శిక్షణ శిబిరం ప్రారంభం



అనపర్తిలో ఉచిత కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం అనపర్తిలోని ఎస్ఎన్ఆర్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని కూటమి అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమం మేళవిస్తూ పాలన సాగిస్తోందన్నారు. బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యుఎస్ సహకారంతో నియోజకవర్గ స్థాయిలో 540మంది మహిళలు ఉచితంగా కుట్టు శిక్షణ పొందుతున్నారని, దీని కోసం ప్రభుత్వం రూ.1.30 కోట్లు వెచ్చిస్తోందన్నారు. ముందుగా పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. కార్యక్రమంలో సత్తి దేవదాన రెడ్డి, జుత్తుగ సూర్యకుమారి, కర్రి శేషారత్నం, బేరా వేణమ్మ, పోతంశెట్టి సుభాషిణి, సిరసపల్లి లక్ష్మి, సర్పంచ్‌లు గిరిడా గంగాభవాని, గొల్లు హేమతులసి, ఎంపీడీవో మండ రామకృష్ణారెడ్డి, తహశీల్దార్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా మండలం రామవరంలో జరిగిన కార్యక్రమంలో పదో తరగతి ఫలితాల్లో జిల్లా టాపర్‌గా నిలిచిన అనపర్తి జడ్పీ బాలుర హైస్కూల్ విద్యార్థి సత్తి కోదండరామారెడ్డిని ఘనంగా సత్కరించి అభినందించారు. అలాగే మండలంలో ఉత్తమ ఫలితాలు సాధించిన అనపర్తి బాలికోన్నత పాఠశాల, రామవరం జడ్పీ హైస్కూల్ విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో నల్లమిల్లి సత్తిరెడ్డి, హెచ్ఎం పులగం వెంకటరెడ్డి, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ మల్లిడి పార్వతి పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

కొవ్వూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మదర్‌థెరీసా హోంలోని విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

పాలి సెట్ పకడ్బందీగా

నిర్వహించాలి : జేసీ

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పాలీసెట్ -2025 పరీక్షను పగడ్బందీగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఈనెల 30న ఉదయం 11గంటలకు నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరిగే ఈ పరీక్షను జిల్లాలో మొత్తం 11 కేంద్రాలలో 5754 మంది విద్యార్థులు రాయనున్నారని జేసీ తెలిపారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం

కడియం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధనలు ఆచరించడం ద్వారా శాంతి చేకూరుతుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. వేమగిరితోటలో పెంతోకోస్తు ప్రార్థనా మందిరం 26వ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన యేసయ్య సువార్త మహాసభలు ముగింపు కార్యక్రమానికి ఆయన విచ్చేసి టీడీపీ నాయకుడు చెల్లుబోయిన శ్రీనివాస్ సమకూర్చిన దుస్తులను క్రైస్తవులకు అందించారు. సంఘకాపరి పి.ప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు దైవ జనులు క్రీస్తు సందేశాలు అందించారు.



రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 42.0 (శుక్రవారం)
కనిష్ఠం : 26.0

మీ వెంటే!

హిందూ ముస్లిం భాయీ..భాయీ.. కష్టమైనా నష్టమైనా ఇప్పటి వరకూ అంతే.. ప్రస్తుతం కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ముస్లింలు ముక్తకంఠంతో ఖండిస్తున్నారు.. అది ముమ్మాటికీ తప్పేనని నినదిస్తున్నారు.. నిడదవోలు, చాగల్లులో శుక్రవారం ముస్లింలు ఇలా రోడ్డెక్కి పహల్గాం మృతులకు నివాళులర్పించారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



నిడదవోలు గణేశ్ చౌక్ సెంటర్‌లో ఉగ్రదాడిపై ముస్లింల నిరసన.. చాగల్లులో మసీదు వద్ద ముస్లింలు ఆందోళన

6



మీ కోసం నేనున్నాను : అభిమానులకు పవన్ అభివాదం

మా బాబే బాగున్నావా : పవన్‌ను ఆప్యాయంగా పలకరిస్తున్న మహిళ



మీ ప్రేమకు.. అభివందనం!

10 నెలలు.. పిఠాపురంలో రూ.100 కోట్ల అభివృద్ధి

- మాట నిలబెట్టుకుంటున్నాం
- పిఠాపురం అభివృద్ధి చేస్తున్నాం
- ఆర్వోబీ పనులకు టెండర్లు
- శాంతిభద్రతలపై రాజీ లేదు
- తప్పుచేస్తే ఉపేక్షించం
- పెద్దాసుపత్రికి శంకుస్థాపన
- అంతా కలిసి పనిచేస్తాం
- పవన్ సుడిగాలి పర్యటన

(కాకినాడ/పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

ఇచ్చిన ప్రతి మాట నిలబెట్టుకుంటున్నాం.. నూరు శాతం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్పష్టం చేశారు. పిఠాపురం, యు.కొత్తపల్లి మండలాల్లో శుక్రవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు.



టీటీడీ కల్యాణ మండపానికి శంకుస్థాపన

గడచిన పది నెలల్లో పిఠాపురం నియోజకవర్గంలో రూ.100 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. తద్వారా 25 వేల మందికి పని కల్పించామని తెలిపారు. మూడు లక్షల మంది ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. పిఠాపురం ఆర్వోబీ నిర్మాణానికి కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ అనుమతిచ్చారని త్వరలోనే టెండర్ల ప్రక్రియ మొదలవుతుందని ప్రకటించారు. ఇటీవల ఢిల్లీ వెళ్లినప్పుడు కేంద్ర రైల్వే మంత్రితో మాట్లాడగా ఆర్వోబీ నిర్మాణానికి నిధులివ్వడానికి అంగీకరించారన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్, టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ, కూటమి నేతలతో కలిసి పనిచేస్తామని ప్రకటించారు. శాంతిభద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని పవన్‌కల్యాణ్ స్పష్టంచేశారు. క్రిమినల్స్, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. ఏ పార్టీ వారైనా ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు. పవన్‌కల్యాణ్ ఉదయం 9.30 గంటలకు పిఠాపురం చేరుకోవాల్సి ఉండగా మూడు గంటల ఆలస్యంగా 12.27 గంటలకు చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద నాయకులు, జిల్లా అధికారులు స్వాగతం పలికారు. అయితే నాయకులు హెలికాప్టర్ వద్దకు రాగా పైలట్ వారిని వెనక్కు వెళ్లాలని కాస్త విసురుగా చెప్పారు. ఇది చూసిన పవన్ నేతలను హెలీకాప్టర్ వద్దకు రమ్మని, పైలట్ వైపు చూస్తూ నేతలను ఏమీ అనవద్దని సూచించారు. పవన్ రోడ్డు మార్గాన పిఠాపురం వస్తూ యండపల్లి, కొండెవరం, నవఖండ్రవాడ తదితర గ్రామాల్లో రోడ్డు పక్కన ఉన్న వారిని చూసి ఆగి వారి సమస్యలు తెలుసుకున్నారు. పిఠాపురం అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో మహిళల ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభించారు. రైతులకు టార్పాలిన్లు, స్ప్రేయర్లు, రోటావేటర్లు, కిసాన్ డ్రోన్ పంపిణీ చేశారు.ముస్లింలు, మహిళలను కలిశారు. ప్రభుత్వాసుపత్రి ఆవరణలో నియోజకవర్గంలోని సీసీ రోడ్లు, డ్రెయిన్లు, బీటీ రోడ్లు, గోకులాలును ప్రారంభించారు.అనంతరం హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ అరగంటకు పైగా కార్‌వ్యాన్‌లో ఉండిపోయి అనంతరం హెలికాప్టర్‌లో రాజమహేంద్రవరం విమానాశ్రయం, అక్కడ నుంచి విజయవాడ చేరుకున్నారు. ఆయన వెంట కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్, టీటీడీ బోర్డు సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ హరిప్రసాద్, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, పెండెం దొరబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, జేసీ రాహుల్ మీనా,జిల్లా ఎస్పీ బిందుమాధవ్, పాడా పీడీ చైత్రవర్షిణి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ఇలా..

పిఠాపురం నియోజకవర్గంలోని పలుగ్రామాల్లో రూ.18.02 కోట్లతో 31.59 కి.మీల మేర 276 సిమెంట్ రోడ్ల నిర్మాణం పూర్తిచేసి ప్రారంభించామని పవన్‌కల్యాణ్ అన్నారు. 5.21 కి.మీల పొడవునా ఏడు తారురోడ్లను రూ.3.20 కోట్లతో పూర్తి చేశామని, వీటి ద్వారా 300 మంది కాంట్రాక్టర్లకు, 5 వేల మంది శ్రామికులకు పనికల్పించామన్నారు. 434 గోదాంలతోపాటు వివిధ పనుల నిమిత్తం రూ.8.68 కోట్లు వ్యయం చేశామన్నారు. మరో రూ.21.58 కోట్లతో చేపట్టిన పనులు మరో మూడు నెలల్లో పూర్తవనున్నాయన్నారు. కొత్తపల్లిలో రూ.2 కోట్లతో టీటీడీ కల్యాణ మండపాన్ని నిర్మిస్తున్నామన్నారు. 225 ఏళ్ల చరిత్ర కలిగిన గొల్లప్రోలు సీతారామస్వామి దేవస్థానంలో రూ.1.32 కోట్లతో ప్రాకార మండపం నిర్మిస్తున్నామన్నారు. చేబ్రోలు సీతారామస్వామి దేవస్థానంలో కాలక్షేప మంటపం, రథశాల నిర్మిస్తున్నామని, మహిళలకు ఉచిత దర్జీ శిక్షణ ఇచ్చి 3,456 కుట్టుమిషన్లు ఉచితంగా అందజేస్తామన్నారు. రైతులకు రూ.26లక్షల వ్యయంతో రెండు వేల టార్పాలిన్లు అందజేస్తామని, రూ.1.94 కోట్లు వ్యయంతో 14 రోటోవీటర్లు, 39 పవర్‌టిల్లర్లు, 50 స్ప్రేయర్లు, కిసాన్ డ్రోన్లను రైతులకు అందజేస్తున్నట్టు చెప్పారు. దీనివల్ల 25 వేల ఎకరాల పంటకు ప్రయోజనం కలుగుతుందన్నారు.

పోలీసులు వర్సెస్ వర్మ

పిఠాపురం అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు వద్ద పోలీసులకు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత ఎస్వీఎస్ఎన్ వర్మ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వర్మతోపాటు వచ్చిన టీడీపీ నేతలను పోలీసులు లోపలకు అనుమతించలేదు. దీనిపై వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారిని అనుమతించకపోతే తాను వెళ్లిపోతానని వర్మ హెచ్చరించడంతో ఎస్పీ బిందుమాధవ్ సముదాయించారు.

నిధుల విడుదల ఇలా..

పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లో తాగునీరు, మురుగునీటి వ్యవస్థ మెరుగుదల, ఇతర పనుల నిమిత్తం ప్రత్యేక గ్రాంటుగా మునిసిపల్‌శాఖ మంత్రి నారాయణ రూ.4 కోట్లు మంజూరు చేశారని పవన్ చెప్పారు. వీటితో త్వరలోనే పనులు చేపడతామన్నారు. పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో ఓహెచ్ఎస్ఆర్, పైప్‌లైన్ల మరమ్మతులు, మురుగునీటి నిర్వహణకు కాకినాడ ఎంపీ నిధులు నుంచి రూ.50 లక్షలు, హౌసింగ్ నుంచి రూ.50 లక్షలు కేటాయించినట్టు చెప్పారు.



ఆసుపత్రి ఇలా..

పిఠాపురం సీహెచ్‌సీని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన పవన్ వైద్యాధికారులతో మాట్లాడారు. ఆసుపత్రి నిర్మాణం ఏ విధంగ ఉండబోతోందో అధికారులు ప్రజంటేషన్ ఇస్తుండగా.. ఆసుపత్రి అందంగా, ఆరోగ్యంగా ఉండాలంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో పిఠాపురం బిడ్డ పవన్ అని కొందరు నినదించగా నవ్వుకుంటూ ముందుకు సాగారు.



రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజవోలులో పంట కాలువ ఇలా..

కాల్వలు.. క్లీన్‌గా!

వేసవిలో పంట కాల్వలకు మరమ్మతులు

- 1747 పనులకు నివేదిక
- 66.64 కోట్ల ప్రతిపాదనలు
- రెండు రోజుల్లో క్లియరెన్స్
- 33 నియోజకవర్గాలపై దృష్టి
- తూడు తొలగింపు చర్యలు
- రేపు కాల్వల మూసివేత
- 10 లక్షల్లోపు నీటి సంఘాలకు
- కాలువల పొడవు 4 వేల కి.మీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)


ప్రభుత్వం అంటే ఎలా ఉండాలి.. ప్రజల సమస్యలు పరిష్కరించాలి.. ప్రజలకు సమస్యలు రాకుండా చూసుకోవాలి. ప్రస్తుత ప్రభుత్వం అదే చేస్తోంది. దీనిలో భాగంగా పంట కాల్వలపై అభివృద్ధిపై దృష్టి పెట్టింది.. గత వైసీపీ ప్రభుత్వంలో అయితే ఐదేళ్లూ ఆ ఊసే లేదు. నీటి సంఘాలను పట్టించుకోలేదు. అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సీజన్‌లో కాలువల ద్వారా నీరందక రైతులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. వైపు భారీవర్షాల వల్ల ముంపు ఏర్పడినపుడు చేలలోని నీరు తిరిగి, బోదుల గుండా బయటకు వచ్చే వీలు లేక నష్టాల పాలయ్యారు. రేపో ఎల్లుండో కాల్వలు కట్టివేయనున్నారు. ఈ నేపథ్యంలో పంట కాల్వల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది.

పంట కాల్వల ఆధునికీకరణకు..

ధవళేశ్వరం బ్యారేజి పరిధిలో తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలతోపాటు, వాటి పిల్ల కాలువలు, బోదెలు ఉంటాయి. అవన్నీ శుభ్రంగా, పటిష్ఠంగా ఉంటేనే నీరుపారుదల సక్రమంగా ఉంటుంది. గోదావరి బ్యారేజీ నుంచి కాలువల్లోకి వెళ్లిన నీరు సులభంగా పంటబోదెల ద్వారా చేలల్లోకి చేరుతోంది. సీఎం చంద్రబాబు నాయుడు ప్రతి ఏటా సమ్మర్‌లో కాలువల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్‌ఎం) నిధులు ఇచ్చి నీటి సంఘాలతో పనులు చేయించేవారు. ఈ ఏడాది అదే విధానాన్ని అవలంభించనున్నారు. ఈమేరకు ముందస్తుగా నీటి సంఘాలను ఎంపిక చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతోపాటు, కొవ్వూరు డివిజన్‌లో మొత్తం నీటి సంఘాలు 432 ఉన్నాయి. డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డీసీ)లు 37, ప్రాజెక్టు కమిటీ (పీసీ)లు 8 ఉన్నాయి. అందులో తూర్పుగోదావరి జిల్లాలో నీటి సంఘాలు 113, డీసీలు 6, పీసీలు 2 ఉన్నాయి. అలాగే అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నీటి సంఘాలు 83, డీసీలు 14, పీసీ 1 ఉంది. కాకినాడ జిల్లాలో నీటి సంఘాలు 236, డీసీలు 17, పీసీలు 5 ఉన్నాయి. ప్రస్తుతం రూ.10 లక్షల్లోపు కాలువల అభివృద్ధి పనులన్నీ వీరి ఆధ్వర్యంలోనే జరగనున్నాయి. డీసీలు,పీసీల సలహాల మేరకు పెద్ద పనులపై అధికారులు నిర్ణయం తీసుకుంటారు.


అసెంబ్లీ	పనులు	నిధులు(కోట్లు)
అమలాపురం	107	3.5 కోట్లు
కాకినాడ రూరల్	53	1.9
కొత్తపేట	68	2.9
మండపేట	67	2.6
ముమ్మడివరం	85	3.4
పి.గన్నవరం	53	2.4
పెద్దాపురం	51	2.3
రామచంద్రపురం	79	2.9
రాజోలు	61	2.5
జగ్గంపేట	31	2.0
పిఠాపురం		3.9
అనపర్తి	31	1.17
కొవ్వూరు	28	2.02
రాజమండ్రి రూరల్	10	62.8 లక్షలు
ప్రత్తిపాడు	26	99.86 లక్షలు
రంపచోడవరం	3	23.99 లక్షలు
తుని	35	74.98 లక్షలు
గోపాలపురం	16	92.02 లక్షలు

మొత్తం 1747 పనులకు రూ.66.64 కోట్లతో పనులు ప్రతిపాదించారు. రెండు మూడు రోజుల్లో శాంక్షన్ ఉత్తర్వులు వస్తాయని ధవళేశ్వరం సర్కిల్ ఎస్ఈ గోపినాథ్ తెలిపారు. పనులన్నీ ఆయా నియోజకవర్గాల శాసనసభ్యులు, మంత్రుల సలహాలు, సూచనల మేరకు ప్రతిపాదించారు.



రేపు కాలువల మూత

ధవళేశ్వరం సర్కిల్ పరిధిలో తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టా కాలువలకు ఈనెల 27 నుంచి నీటి సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ నేపథ్యంలో కాలువల అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ధవళేశ్వరం గోదావరి పరిధిలోని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వ్యాప్తంగా 33 నియోజకవర్గాల్లో రూ.66.64 కోట్లతో 1747 పనులు చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. రెండు మూడు రోజుల్లో వాటికి అనుమతి తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేయనున్నారు.ఉత్తర్వులు వచ్చిన వెంటనే కాలు వల్లో నీరు తగ్గిన తర్వాత నీటి సంఘాలు పనులు చేపడతాయి.అసెంబ్లీ నియోజకవర్గాల వారీ పనులు గుర్తించారు. అన్ని నియోజకవర్గాల్లో ప్రధాన పంట కాలువలు, పిల్లకాలువలు సుమారు 4 వేల కి.మీ మేర ఉంటాయి.



ధవళేశ్వరం వద్ద నిండుగా గోదావరి కాల్వ

ధాన్యం దిగుబడిని బట్టి లక్ష్యం ఉండాలి : కలెక్టర్

రాజమహేంద్రవరం,ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రబీ సీజన్‌లో ధాన్యం దిగుబడి ఆధారంగా ధాన్యం సేకరణ లక్ష్యం నిర్దేశించుకోవాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు.కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాత్రి జేసీ ఎస్.చిన్నరాముడు, గెయిల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం. ప్రేమ్ కుమార్, డీఎస్‌వో ఎస్.భాస్కర రెడ్డి, జిల్లా సహకారి అధికారి ఎం. జనార్దన రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, తదితరులతో కలసి ధాన్యం సేకరణపై సమీక్షించారు. గ్రామ స్థాయిలో ఉన్న రైతు సేవా కేంద్రం నుంచి ధాన్యం సేకరణపై పర్యవేక్షణ వ్యవస్థ పటిష్ఠంగా ఉండాలన్నారు. గెయిల్ డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో కంట్రోలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయా లన్నారు. రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ కొనసాగించాలని సూచించారు. జిల్లా సహకార అధికారి ఆధ్వ ర్యంలో పని చేసే క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది చురుకైన పాత్ర పోషిం చాలని ఆదేశించారు.రైతు సేవా కేంద్రా లకు,బహిరంగ మార్కెట్‌కు సంబంధించిన లావాదేవీలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. సమన్వయ శాఖల అధికారులు, సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలన్నారు.



కలవచర్లలో ఇండస్ట్రియల్ పార్క్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఇండస్ట్రియల్ పార్క్ పూర్తి చేయండి

రాజానగరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమల స్థాపనకు అన్ని రకాలైన మౌలిక సదుపాయాలను మే1వ తేదీ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులకు ఆదేశించారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కలవచర్లలో 104 ఎకరాల విస్తీర్ణంలో రూ.60.65 కోట్లతో రూపుదిద్దుకోనున్న ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏపీఐఐసీ అధి కారులతో కలిసి శుక్రవారం సందర్శించారు. పారిశ్రామికవాడలో అభివృద్ధి పనులు స్వయంగా పరిశీలించారు.పారిశ్రామిక ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ తదితర సౌకర్యాలతో దాదాపు 80 శాతం మేర ఇప్పటికే అభివృద్ధి పనులు పూర్తయినట్లు కలెక్టర్ చెప్పా రు. పరిశ్రమల స్థాపనకు ఆయా కేటగిరీల వారిగా సబ్సిడీ సదుపాయం కల్పించే యో చనలో ప్రభుత్వం ఉందన్నారు. ఈ కార్య క్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ రమణా రెడ్డి, డిప్యూటీ జోనల్ మేనేజర్ సుధారాణి,ట్రాన్స్‌కో ఎస్ఈ తిలక్, జిల్లా అధికారులు రమణ, కుమార్, ఎన్వీ సత్యనారాయణ, రాజా నగరం తహశీల్దార్ జి.అనంతలక్ష్మి సత్యవతి దేవి, ఏఈ సుధాకర్ తదితరులు ఉన్నారు.

డీపీఆర్‌వోగా బాలకృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా పౌర సంబంధాల అధికారిగా వై.బాలకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం బాధ్యతలు స్వీకరించి ఆయన జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిశారు. బాపట్ల జిల్లా చెరుకుమిల్లి మండలం ఆరేపల్లికి చెందిన బాలకృష్ణ ఆయన పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్శిటీలో మాస్టర్ ఇన్ జర్నలిజం చేశారు. 2022లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో ఉత్తీర్ణుల య్యారు.తూర్పుగోదావరి జిల్లాకు బాలకృష్ణను డీపీఆర్‌వోగా ప్రభుత్వం నియమించింది.


భూసార పరీక్షలు తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

గోపాలపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి భూసార పరీక్షలు తప్పనిసరి అని జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు అన్నారు. మండలంలోని చిట్యాల రైతుసేవా కేంద్రంలో జిల్లాస్థాయి వ్యవసాయాధికారులకు భూసార పరీక్షలపై ఒక్కరోజు శిక్షణ శుక్రవారం నిర్వహించారు. ప్రతి ఏడాది భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా భూమి స్థితిగతులు రైతులకు అవగతం అవుతాయన్నారు.జిల్లాలో ఈ ఏడాది 24321 మట్టి నమూనాలు సేకరించడం లక్ష్యంగా నిర్దేశించుకు న్నామన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది మే నెల 15వ తేదీలోపు నమూనాలు సేకరించాలన్నారు. సుస్థిర దిగుబడులు పొందడానికి భూసారపరీక్షలు దోహదం చేస్తాయని రైతులు ప్రభుత్వం ఉచితంగా చేపడుతున్న భూసార పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ జయరామలక్ష్మి, 19 మండలాల వ్యవసాయాధికారులు, నాలుగు డివిజన్ల ఏడీఏలు, ప్రకృతి వ్యవసాయ ఏడీఏ తాతారావు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ఓపీ పెంచండి

వైద్యులకు కలెక్టర్ ఆదేశం



రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 15 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని వైద్యసేవలు పూర్తిస్థాయిలో అందించాలని, ఓపీ సేవలు మరింత పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, గర్భిణులు, పిల్లలకు సంబంధించిన సేవలు, ల్యాబ్ టెస్టులు సంపూర్ణంగా అందించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. రాజమహేంద్రవరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాత్రి పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలపై సంబంధిత వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఏఎన్‌ఎంలతో పాటు వైద్య సిబ్బంది అందరూ సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లకు ఇతర పనులు అప్పగించకుండా, పూర్తిగా ఆరోగ్యకేంద్రాల్లోనే వారి సేవలు ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. హాస్పటల్ అభివృద్ధి కమిటీ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు,మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వినూత్న, వైద్యాధికారులు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న జేసీ చిన్నరాముడు

'పండ్లపై రసాయనాలు ఆరోగ్యానికి హానికరం'

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : వ్యాపారస్తులు నిషేధిత కాల్షియం కార్బైడ్ వంటి రసాయనాలతో కృత్రిమంగా పండ్లను మాగబెడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జేసీ ఎస్.చిన్నరాముడు హెచ్చరించారు. పండ్లను కృత్రిమంగా రసాయనాలతో మాగబెట్టడం ఆరోగ్యానికి హానికరం అన్నారు.శుక్రవారం జేసీ సమావేశ మందిరంలో జేసీ చిన్నరాముడు వివిధ సమన్వయశాఖల అధికారులతో జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. రైతులు, వ్యాపారస్తులు, వినియోగదారులకు ఈనెల 26వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు రాజమహేంద్రవరం మార్కెట్ యార్డులో అవగాహన కల్పిస్తామని వెల్లడించారు.మామిడి, ఇతర పండ్లను కృత్రిమంగా పండ్లను మాగబెట్టడం వల్ల ఆరోగ్యపరమైన నష్టాలు జరుగుతాయన్నారు.సమావేశంలో జిల్లా ఆహారభద్రత అధికారి రుక్కయ్య, మార్కెటింగ్‌శాఖ జిల్లా అధికారి సునీల్ వినయ్ పాల్గొన్నారు.

దేశ ప్రయోజనాల దృష్ట్యా 'వక్ఫ్' సవరణ చట్టం 2025



పట్టణంలో కరపత్రాలను పంచుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, ఇతర నేతలు

కొవ్వూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : వక్ఫ్ బోర్డు సవరణ చట్టం 2025 ద్వారా పారదర్శకత, జవాబుదారీతనాన్ని మెరుగుపర్చవచ్చునని, ఈ చట్టం దేశ ప్రయోజనాల దృష్టా రూపొందించబడిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. శుక్రవారం కొవ్వూరు పట్టణంలో ముస్లింలకు బీజేపీ నాయకులు కరపత్రాలు పంపిణీ చేసి వక్ఫ్ సవరణ చట్టం 2025పై అవగాహన కల్పించారు. నాగేంద్ర మాట్లాడుతూ ఇష్టం వచ్చినట్టు ఆస్తులను సొంతం చేసుకోవడాన్ని నిరోధించడానికి, మతపరమైన స్వేచ్ఛ, సమానత్వానికి సంబంధించి రాజ్యాంగపరమైన ఆందోళనలను పారద్రోలడానికి వక్ఫ్ సవరణ చట్టం చేయబడిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎస్. నాగరాజు, బేగ్, పిల్లలమర్రి మురళీకృష్ణ, బోడపాటి ముత్యాలరావు, విజయభాస్కర్, పవన్, రత్నసాయి, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేపై డివిజనల్ స్థాయి సిబ్బందికి అవగాహన



సమీక్షా సమావేశంలో పాల్గొన్న అధికారులు

కొవ్వూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలో లోపాలు లేకుండా పారదర్శకంగా జరిగేలా చూడాలని ఆర్డీవో డాక్టర్ రాణీసుస్మిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సుందరసాయి కల్యాణ మండపంలో డివిజనల్ స్థాయిలో రెవెన్యూ, సర్వేయర్లతో రెండవ ఫేజ్ రీసర్వేపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి ఫేజ్ రీసర్వే జరిగిన తీరు, వాటిలో తలెత్తిన తప్పులను ఏవిధంగా సరిదిద్దాలనే దానిపై రీసర్వే బృందాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రీసర్వే జరిగే గ్రామాలలో రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. సరిహద్దు రైతులు తప్పనిసరిగా హాజరయ్యే విధంగా చూడాలన్నారు. ఐఏఎస్ టీ. వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఎస్‌వో వెంకటేశ్వరరావు, డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు, రీసర్వే డీటీలు, మండల, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

జిల్లాలో ఆశాజనకంగా రబీపంట



అట్లపాడులో వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న జేడీ అప్పలకొండ

నిడదవోలు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీపంట దిగుబడి ఆశాజనకంగా ఉందని జిల్లా గణాంకశాఖ జేడీ ఎల్.అప్పలకొండ అన్నారు. శుక్రవారం అట్లపాడులోని వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించి మాట్లాడుతూ వరిపంట కోతప్రయోగం చేయగా, దిగుబడి బాగా వచ్చిందన్నారు. ఉపగణాంకశాఖాధికారి జె.సూర్యనారాయణ, సహాయ గణాంక అధికారి జి. అనిల్ ప్రసన్న కుమార్ ఉన్నారు.

నెల్లూరులో ఆత్మహత్య చేసుకున్న యువకుడిది కొవ్వూరేనా ?

కొవ్వూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు పట్టణంలోని సింహపూరి లాడ్జిలో ప్రేమికులు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటనలో యువకుడు కొవ్వూరు పట్టణానికి చెందిన బచ్చు జోసఫ్ రత్నాకర్‌గా నెలూరు పోలీసులు గుర్తించారు. సంఘటనా స్థలంలో లభించిన ఆధార్, సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందజేయగా, ఫోన్ మాట్లాడిన వ్యక్తి కుటుంబసభ్యులు ఆరోగ్యపరిస్థితులను బట్టి ఆత్మహత్య ఘటనను గోప్యంగా ఉంచారా అన్న సందేహాలు కలుగుతున్నాయి. అంతేకాకుండా క్రిస్టియన్‌పేటలో తల్లితండ్రులు, ఇద్దరు సోదరులకు విషయం తెలియనట్టు ఉండడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. పట్టణానికి చెందిన బచ్చు డేవిడ్‌రాజుకు ముగ్గురు కుమారులు కాగా, పెద్దకుమారుడు జోసఫ్ రత్నాకర్ బీటెక్ పూర్తిచేసి రాజమండ్రిలో ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల ఇంటర్వ్యూ కోసం నెల్లూరు వెళ్లినట్టు సమాచారం. దీనిపై పట్టణ పోలీసులను అడుగ్గా తమకు ఎలాంటి సమాచారం లేదని బదులిచ్చారు.



కొవ్వూరు మెరకవీధిలో నిరసన తెలుపుతున్న జనసేన పార్టీ నాయకులు



చాగల్లులో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

ఉగ్రవాదుల దాడి అమానుషం

● పలుచోట్ల హోరెత్తిన శాంతిర్యాలీలు, ధర్నాలు

కొవ్వూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేయడాన్ని జనసేన నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శుక్రవారం కొవ్వూరు మెరకవీధి వాటర్‌ట్యాంకు వద్ద ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో మారిశెట్టి వెంకటేశ్వరరావు, డేగల రాము, కళ్ళేపల్లి ప్రభాత్, ఎరుబండి సురేష్, కె. నవ్య, వీరా హరిబాబు, కల్లి శ్రీను, అచ్యుతరాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే కాపవరంలో గురువారం రాత్రి జనసేన మండల అధ్యక్షుడు సుంకర సత్తిబాబు ఆధ్వర్యంలో ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఉప్పులూరి రాజేంద్ర మునిప్రసాద్, గంగుమళ్ళ స్వామి, బాలకృష్ణ, సతీష్, రాంబాబు, శేఖర్, శివ, తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: జమ్మూ కశ్మీర్‌లోని పెహల్గాంలో యాత్రికులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ స్థానిక ఇస్లామ్‌పేటలో ముస్లిం సోదరులు శుక్రవారం శాంతి ర్యాలీ చేశారు. స్థానిక జామియా మసీద్‌లో నమాజ్ అనంతరం ర్యాలీ ప్రారంభించారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు షేక్ షరీఫ్, గౌస్ బేగ్, ఎండీ తన్వీర్ అహ్మద్, అల్తాఫ్ జానీ, అల్తాఫ్ అహ్మద్, బాబు బేగ్, సర్దార్ పాషా, బషీర్, అన్వర్ బేగ్ పాల్గొన్నారు.

దేవరపల్లి: జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడులకు పాల్పడడం అమానుషమని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక బస్టాండ్ వద్ద కూటమి నాయకులు, అంగన్వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం గోపాలపురం మూడురోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ కొనసాగింది. కేంద్రప్రభుత్వం ఉగ్రవాదాన్ని పూర్తిగా అణిచివేయాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, సువర్ణరాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు ఆండ్రూ అనీల్, సుంకర దుర్గారావు, ఉప్పులూరి రాంబాబు, గద్దే సుబ్రహ్మణ్యం, పెనుమత్స సుబ్బరాజు, ఓరుగంటి లక్ష్మీపతిరాజు, కొయ్యలమూడి సుధారాణి, గద్దే రమాదేవి, కాట్నం రాంబాబు, కంబాల సత్తిబాబు, పసుపులేటి శివనాగప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: కశ్మీరులో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ శుక్రవారం సమిశ్రగూడెంలోని రాయల్ మసీదు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు మాట్లాడుతూ పెహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిని ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎండీ అక్రమ్, ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అలాగే గణపతి సెంటరులో ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ముస్లిం జేఏసీ నాయకులు, ముస్లిం సోదరులు, ప్రజాసంఘాల నేతలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



సమిశ్రగూడెం రాయల్ మసీదు వద్ద ధర్నా చేస్తున్న ముస్లిం సోదరులు



దేవరపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి, సువర్ణరాజు

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలి

తాళ్లపూడి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వేగేశ్వరపురం కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదోతరగతి పరీక్షా ఫలితాల్లో 93 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు హెచ్ఎం బాలామణి తెలిపారు. దీనిలో భాగంగా విద్యార్థి షేక్ బుష్రా 580 మార్కులతో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రథమస్థానంలో నిలిచిందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. గ్రామసర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు పాల్గొని తల్లితండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని విజ్ఞప్తి చేశారు. ర్యాలీలో ఎంఈవో -2 నెహ్రూజీ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో సర్పంచ్ పరశురామారావు, హెచ్ఎం

నిత్యావసర సరుకులు అందజేత

కొవ్వూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మదర్‌థెరీసా హోంలోని విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు శుక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ జె. సునీత ఆధ్వర్యంలో చాకెట్లు అందజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, భూపతిరాయలు, రాజేశ్వరరావు, జయానంద్ కుమార్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త మధర్‌సాహెబ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్



నోటిఫికేషన్ విడుదల చేస్తున్న ఎంఈవో-2 రామకిషోర్, తదితరులు

కొవ్వూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్ట ప్రకారం రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం ప్రవేశాలు కల్పించాలని ఎంఈవోలు బీఎస్ స్వరూప్, కె. రామకిషోర్ తెలిపారు. ఈ చట్టం ప్రకారం సమాజంలో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వర్గాలకు చెందిన పిల్లలు, అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధితుల పిల్లలు, దివ్యాంగుల కోసం 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాలకు (బీసీ, మైనారిటీ, ఓసీ) చెందిన పిల్లలకు 6 శాతం సీట్లు కేటాయించడం జరిగిందన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తిచేయాలి

● స్పెషల్ ఆఫీసర్ వై. అమ్మాజీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న అమ్మాజీ

తాళ్లపూడి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ దశల్లో నిలిచిపోయిన గృహ నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని స్పెషల్ ఆఫీసర్ వై. అమ్మాజీ కోరారు. శుక్రవారం తాళ్లపూడి పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన అదనపు లబ్ధిని వినియోగించుకోవాలని సూచించారు. బీసీలకు 50 వేల రూపాయలు, ఎస్సీ, ఎస్టీలకు రూ. 75 వేలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. మండలంలో 233 ఇళ్లు నిర్మాణదశలో ఉన్నాయని హౌసింగ్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఈవోపీఆర్డీ వీరన్న, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కందుల దుర్గేష్ చొరవతో...

● ఆగిన రైల్వే గోడ నిర్మాణం

● కృతజ్ఞతలు తెలిపిన ఇందిరానగర్ కాలనీ వాసులు



రైల్వేగోడను మూయవద్దంటూ ఆందోళనకు దిగిన స్థానికులు

నిడదవోలు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రైల్వేశాఖ తన పరిధిలో ప్రజలు ట్రాక్ దాటేందుకు వీలులేకుండా గోడ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగి సమస్యను మంత్రి దుర్గేష్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన చొరవతో సమస్య పరిష్కారమైంది. వివరాలివి శుక్రవారం పట్టణంలోని ఇందిరానగర్‌లో ఉన్న రైల్వే గోడ వద్ద నుంచి రైల్వేట్రాక్ దాటి ఇందిరానగర్ రాయిపేట బసివిరెడ్డిపేట ప్రజలు నడకబాటన రాకపోకలు సాగిస్తుంటారు. అయితే రైల్వేశాఖ అలా సాగించేందుకు వీలులేకుండా గోడనిర్మాణ పనులు ప్రారంభించింది. దీనిపై ఆ ప్రాంత ప్రజలంతా అక్కడకు చేరుకుని ఆందోళన చేశారు. మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ సంఘటన స్థలానికి వచ్చి మంత్రి కందుల దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన అక్కడకి వచ్చి రైల్వే అధికార్లను సంప్రదించి ఆర్వోబీ నిర్మాణం పూర్తి అయ్యేంత వరకు ఇందిరానగర్‌లో రైల్వేగోడ నిర్మాణం వాయిదా వేసుకోవాలని సూచించారు. దీంతో రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించారు. దీంతో ట్రాక్ దాటేందుకు ఆ ప్రాంత ప్రజలకు రాకపోకలు సాగించేందుకు వీలు కలగడంతో మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

అమ్మ వద్దు.. నాన్న కావాలి !

● ప్రియుడితో వెళ్లిపోయిన వివాహిత

● చిన్నారులను చిత్రహింసలు పెట్టిన ప్రియుడు

● మూడు నెలల కిందట మేనమామ వద్దకు చిన్నారులు

● పోలీసులను ఆశ్రయించిన చిన్నారుల మేనమామ

● మూడు నెలలుగా పోలీస్‌స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు



రాజానగరం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఓ వైపు నవ మాసాలు మోసి, కనిపెంచిన పసిబాలురు, మరో వైపు అగ్ని సాక్షిగా తాళి కట్టిన భర్తను వదిలి ప్రియుడి వెంట వెళ్లిపోయింది. ఆపై తండ్రి కూడా వదిలివెళ్లిపోవడంతో అందరూ ఉన్న అనాథలుగా కాలం వెళ్లదీస్తున్న చిన్నారుల హృదయ వేదన ఇది..వివరాల్లోకి వెళితే... తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొంతమూరులోని చెంచుల కాలనీలో నివాసం ఉంటున్న అన్నెపు ధనలక్ష్మి, జయరామ్ దంపతులకు తేజ కిరణ్, భానుప్రకాష్ అనే పది, ఎనిమిదేళ్ల పిల్లలు ఉన్నారు. ప్రస్తుతం చిన్నారులిద్దరూ రాజమహేంద్రవరంలోని నారాయణ స్కూల్లో 4, 2 తరగతులు చదువుతున్నారు. తండ్రి జయరామ్ పెయింటింగ్ వర్కు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య ధనలక్ష్మి కర్రీ పాయింట్‌లో కేటరింగ్ పనులు చేస్తుండేది. ఈ క్రమంలో మందపల్లి ప్రవీణ్‌కుమార్‌తో ఆమెకు పరిచయం ఏర్పడి అది వివాహేతర బంధానికి దారితీసింది. ప్రియుడి మోజులో పడిన ధనలక్ష్మి ఇద్దరు పిల్లలను, భర్తను పట్టించుకోకుండా ప్రియుడితో కాలం గడుపుతోంది. కూతురు ప్రవర్తన తీరును మందలించాల్సిన తల్లి తులసమ్మ.. అల్లుడు జయరామ్ బయటకు వెళ్లిపోయేలా చేసింది. ఏడాదిగా తల్లి వద్దనే ఉంటున్న చిన్నారులిద్దరితో ప్రియుడికి అవసరమైన సేవలు చేయించేది. తల్లి చెప్పిన పనులు చేయకపోతే ప్రియుడు ప్రవీణ్‌కుమార్ చిన్నారులను బెల్టు, వైర్లతో శరీరంపై తట్టులు వచ్చేలా కొడుతూ చిత్రహింసలకు గురిచేసేవాడు. దీంతో విషయం తెలుసుకున్న చిన్నారుల మేనమామ పాలవలస బాలమణికంఠ రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేసి, రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నారులకు చికిత్స చేయించి, తన ఇంటికి తీసుకెళ్లాడు. మూడునెలలుగా మేనమామ సంరక్షణలో ఉంటున్న చిన్నారులిద్దరూ తమను నాన్న వద్దకు చేర్పించాలంటూ దీనంగా మేనమామను వేడుకుంటున్నారు. దీంతో మేనమామ బాలమణికంఠ చిన్నారులను వెంటబెట్టుకుని మూడునెలలుగా రాజానగరం పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కడం దిగడం చేస్తున్నాడు. ఈ విషయమై కేసు దర్యాప్తు చేస్తున్న ఎస్.ఐ నారాయణమ్మను శుక్రవారం ఫోన్‌లో సంప్రదించగా చిన్నారుల తండ్రి శ్రీకాకుళంలో ఉంటున్నాడు. కబురు పంపించాం, ఒకటి, రెండు రోజుల్లో వస్తానన్నారు. చైల్డ్ వెల్ఫేర్‌కమిటీ, తల్లిదండ్రుల సమక్షంలో చిన్నారులు ఎవరి వద్ద ఉంటామంటారో విన్న తర్వాత నిర్ణయం తీసుకుంటామని బదులిచ్చారు. ప్రస్తుతం చిన్నారులు మేనమామ సంరక్షణలో ఉంటున్నారు.

రమేష్ మృతి పార్టీకి తీరని లోటు

● నివాళి అర్పించిన ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు



కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి , తదితరులు



రమేష్ (ఫైల్)

నల్లజర్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): చీపురుగూడెంకి చెందిన టీడీపీ క్రియాశీలక కార్యకర్త చెల్లు రమేష్ (పండు) మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు అన్నారు. శుక్రవారం ఉదయం రమేష్ గుండెపోటుతో మృతి చెందడంతో పార్టీ గ్రామ అధ్యక్షుడు చెల్లు పెద్దరామన్న, సీనియర్ నేత కూసంపూడి వెంకటేశ్వరరావు ఇచ్చిన సమాచారం మేరకు ఆయన పార్థివదేహానికి నివాళి అర్పించారు. తామంతా కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. గోపాలపురం నియోజకవర్గ జనసేన కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు రమేష్ నివాళి అర్పించారు. అధిక సంఖ్యలో టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు, గ్రామస్థుల మధ్య రమేష్ అంత్యక్రియలు ముగిశాయి.

మహిళలు అన్నిరంగాల్లో ఆర్థికాభివృద్ధి సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మద్దిపాటి

దేవరపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. దేవరపల్లిలో మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బేటీ బచావో, బేటీ పడావో, పోషన్ పక్వాడ కార్యక్రమాన్ని ఆర్యవైశ్యకల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ కే.విజయకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుషులు, స్త్రీలు సమానంగా ఉండాలని, గతంలో ఆడపిల్లలను భారంగా భావించి అబార్షన్లు చేయించుకోవడం వల్ల మహిళల సంఖ్య తగ్గిందన్నారు. ముందుగా దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ప్రభుత్వ మహిళా ఉద్యోగుల వేషధారణలో అంగన్వాడీ చిన్నారులు అలరించారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించి చీరలు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. అంగన్వాడీ సెంటర్ల మహిళలు వివిధరకాల పౌష్టికాహార ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ నియోజకవర్గ అధికారి నాగలక్ష్మి, ఎంపీడీవో ఎస్.వేణుగోపాలరెడ్డి, తహశీల్దార్ శ్రీనివాస్, టీడీపీ మండల అధ్యక్షుడు ఆండ్రూ అనీల్, ఎంఈఓలు తిరుమలదాసు, అప్పారావు, టీడీపీ నాయకులు సుంకర దుర్గారావు, కొయ్యలమూడి సుధారాణి, గద్దే రమాదేవి, కాకర్ల రామతులసి, గద్దే సుబ్రహ్మణ్యం, యాగంటి వెంకటేశ్వరరావు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం



ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

తాళ్లపూడి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా మలకపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.అన్నపూర్ణ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2030 నాటికి మలేరియా నిర్మూలనే మనందరి లక్ష్యం కావాలన్నారు. మలేరియా దోమకాటు ద్వారా వచ్చే ఒక అంటువ్యాధి అన్నారు. ర్యాలీలో డాక్టర్ పి. సుచందన, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



ఉండ్రాజవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్.ఉషాదేవి మాట్లాడుతూ జ్వరం వస్తే ప్రజలు సొంతవైద్యం వద్దని చెప్పారు. డాక్టర్‌ను సంప్రదించి మందులు వాడాలన్నారు. మలేరియా జ్వరంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని, దీనికి సిబ్బంది తెలియజేయాలని కోరారు. మలేరియా అంతం మనతోనే ... అనే నినాదంతో అందరూ ముందుకు వెళ్లాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మాజీఎమ్మెల్యే శేషారావు

ఉండ్రాజవరం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి, మాజీఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు శుక్రవారం పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఇందులో మోర్తకి చెందిన ఈడ్పుగంటి అశోక్‌కు రూ. 5.86 లక్షలు, ఈడ్పుగంటి పద్మావతికి రూ. 1.80 లక్షలు, పెదపూడి అచ్చియ్యకు రూ.59వేలు అందజేశారు. అలాగే వడ్లూరుకి చెందిన భూపతి సత్యనారాయణరాజుకు రూ.43వేలు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా శేషారావు మాట్లాడుతూ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలను ఆదుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: అనారోగ్యంతో బాధపడే సామాన్య ప్రజానీకాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని మాజీఎమ్మెల్యే ,బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. ప్రభు త్వం నుంచి వివిధ గ్రామాల్లోని లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం తన కార్యాలయంలో స్థానిక నాయకుల సమక్షంలో అందజేశారు. ఉసులుమర్రు, తీపర్రు, ముక్కామలకు చెందిన ముగ్గురు లబ్ధిదారులకు దాదాపు రూ. 5 లక్షల 20 వేల చెక్కులను అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు అతికాల శ్రీను, కంటిపూడి సూర్యనారాయణ, నల్ల సురేంద్ర, సింహాద్రి సత్యనారాయణ, మొగళ్లపు సీతారామ్, తదితరులు పాల్గొన్నారు.



పెరవలిలో చెక్కుమ అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు